

ఎక్కడా ప్రాణ నష్టాలు లేవు

భీమవరం టౌన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి):మొంథా తుఫాన్ కారణంగా జిల్లాలో ఎక్కడా ప్రజల ప్రాణ, పశు నష్టాలు జరగలేదని కలెక్టర్ సీహెచ్ నాగరాణి తెలిపారు. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో.. 'భారీ వర్షం కారణంగా భీమవరం మండలం తోకతిప్పలో రోడ్లపై రెండు అడుగులు, నరసాపురం మండలం బియ్యపుతిప్పలో ఒక అడుగు మేర నీరు నిలిచి ఉంది. తొలగింపునకు చర్యలు చేపట్టాం. జిల్లాలో 93 ఇళ్లు, 174 విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయి. బలమైన గాలులకు 662 చెట్లు నేలకొరిగాయి. రోడ్లపై పడిన చెట్లను తొలగించాం. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల ప్రజలకు నిత్యావసర వస్తువులను ఉచితంగా పంపిణీ చేస్తాం. ఐదు రోజులపాటు వేట కోల్పోయిన మత్స్యకారులకు 50 కేజీల బియ్యం, పంపిణీ చేస్తాం. పునరావాస కేంద్రంలోని ప్రతీ బాధిత కుటుంబానికి 25 కేజీల బియ్యం, కిలో కంది పప్పు, లీటరు వంట నూనె, కిలో బంగాళా దుంపలు, కిలో ఉల్లిపాయలు, కిలో పంచదార అందిస్తున్నాం' అని తెలిపారు.

నేటి నుంచి తెరుచుకోనున్న స్కూల్స్

జిల్లాలో గురువారం నుంచి విద్యా సంస్థలు మళ్లీ తెరచుకోనున్నాయి. మొంథా తుఫాన్‌తో మూడు రోజుల పాటు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ప్రకటించారు. పాఠశాలలు తెరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. తుఫాన్ తీరాన్ని తాకి వాతావరణం తెరిపివ్వడంతో మళ్లీ గురువారం నుంచి వీటిని తెరిచేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.


గండిపడిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి

ముంచిన మొంథా

- చివరి క్షణం వరకు ఉత్కంఠ.. తుఫాన్ తీరం దాటినా వీడని భయం
- ఎగసిపడిన కెరటాలు.. వెంటాడిన ఈదురుగాలులు.. వీడని వర్షం
- కంటి మీద కునుకు లేకుండా గడిపిన తీర గ్రామాలు
- నేలకూలిన విద్యుత్ స్తంభాలు.. చెట్లు పడి ధ్వంసమైన విద్యుత్ వైర్లు


నేలనంటిన వరి పనలు

(భీమవరం/నరసాపురం రూరల్ -ఆంధ్రజ్యోతి)

తీర ప్రాంతంలో మంగళవారం రాత్రి ఎవరికీ కంటి మీద కునుకు లేదు. ఓ వైపు గాలులు.. మరోవైపు సముద్రపు హోరు.. ఇటు చూస్తే బోరున వర్షం.. కరెంటు లేదు.. ఏం జరుగుతుందో తెలియదు.. మొంథా తుఫాన్ అంతర్వేదిపాలెం - బియ్యపుతిప్ప మధ్య తీరం దాటుతుందనే హెచ్చరికతో ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడిపారు. చివరకు ప్రభుత్వ ముందస్తు చర్యలు సత్ఫలితాలని ఇచ్చాయి.

జిల్లాను మొంథా తుఫాను ముంచి వెళ్లింది. కాకినాడ వద్ద తీరం దాటుతుందని అంతా అంచనా వేశారు. చివరకు బియ్యపుతిప్ప వద్ద తీరం దాటనున్నట్టు రాష్ట్ర విపత్తుల సంస్థ ప్రకటించడంతో జిల్లా యంత్రాగం హై అలర్ట్ అయ్యింది. మంగళవారం రాత్రి ఏడు గంటల ప్రాంతంలో ఈదురుగాలులు వీచిన మండలాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ఇక తీరం దాటే సమయంలో జిల్లా ప్రజలు ఊపిరి బిగబట్టి ఉన్నారు. తీర గ్రామాల ప్రజల్లో కంటి మీద కునుకు లేదు. ఎంతటి విపత్తు తెస్తుందోనని ఆందోళనకు గురయ్యారు. ప్రతిక్షణం ఒక యుగంలా గడచింది. మంగళవారం రాత్రి 11.30 గంటలకు పూర్తిగా తీరం దాటుతుందని, ఆ సమయంలో తీవ్ర తుఫాన్‌గా దాడి చేస్తున్న మొంథా జిల్లాలో ఎటువంటి అల్లకల్లోలం సృష్టిస్తుందోనని ఆందోళన చెందారు. సీఎం చంద్రబాబు రాత్రి వేళ జిల్లా కలెక్టర్‌తో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్, కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ కలెక్టరేట్‌లో ఉంటూ కలెక్టర్‌తో కలిసి తీర ప్రాంత పరిస్థితులను గమనిస్తూ వచ్చారు. అధికారులను, సిబ్బందిని అప్రమత్తం చేశారు. మంత్రి నిమ్మల రామానాయుడు తీరప్రాంతానికి చేరుకుని అక్కడ ప్రజల్లో ధైర్యాన్ని నింపారు. రెవెన్యూ, పోలీస్, ఇతర శాఖలన్నీ తీర ప్రాంతంలోనే గస్తీ ఉన్నాయి. అర్ధ రాత్రి 12 గంటలైంది. జిల్లా అంతా ప్రశాంతంగానే ఉంది. తుఫాన్ బియ్యపుతిప్ప సమీపంలోనే తీరం దాటిందా లేదా వేరొకచోట అన్న అనుమానం కలిగింది. తుఫాన్‌కు ముందు వర్షం, ఈదురుగాలులు వీచాయి. తీరం దాటే సమయంలో ఎటువంటి అలజడి లేకపోవడంతో జిల్లా అధికారుల్లోనే ఆశ్చర్యం కలిగింది. మొత్తానికి అర్ధరాత్రి తర్వాత గండం గట్టెక్కిందని, ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నారు. కాని, రాత్రి మూడు గంటల సమయంలో జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ఒక్కసారి సుడిగాలి వీచింది. గాలుల బీభత్సంతో వరిచేలు నేలవాలాయి. సుమారు 26,381 ఎకరాలకు నష్టం వాటిల్లింది. సూర్యోదయ సమయానికి గాలులు తీవ్రత తగ్గిపోవడంతో నష్ట తీవ్రత అంచనాకంటే తగ్గింది. జిల్లా అంతటా తుఫాన్ తర్వాత ప్రశాంతత ఏర్పడింది. నష్టం తక్కువగా ఉండడంతో హుటాహుటిన సహాయక చర్యలు చేపట్టారు. పడిన చెట్ల వెంటనే తొలగించారు. విద్యుత్ స్తంభం నేలకొరిగితే జేసీబీలతో సరిచేశారు. ఇలా అన్ని శాఖలు అలుపెరగకుండా కష్టపడ్డాయి. పీఎం లంకలో సముద్రం వంద మీటర్ల మేర ముందుకు చొచ్చుకొచ్చింది. తోటల్లోకి నీరు రావడంతో గ్రామస్థులు ఆందోళన చెందారు. వేటలో 50 ఏళ్ల అనుభవం వున్న మత్స్యకారులు సైతం సముద్రం ఒడ్డుకు వచ్చేందుకు వెనకడుగు వేశారు. మధ్యాహ్నానికి కడలి శాంతించి వెనక్కి వెళ్లినా.. హోరు తగ్గలేదు. గాలులు బలంగానే వీస్తూనే ఉన్నాయి. సముద్రాన్ని చూసేందుకు చాలామంది బీచ్‌లకు వచ్చారు.

జిల్లాలో ఇదీ నష్టం

భీమవరం టౌన్ : జిల్లాలో మొంథా తుఫాన్ మిగిల్చిన నష్టాల లెక్కలు తేలుతున్నాయి. ఈ మేరకు అధికారులు నివేదిక రూపొందించారు. పశ్చిమలో తుఫాన్ ప్రభావిత మండలాలు 20 కాగా, గ్రామాలు 49, పట్టణాలు ఐదు వున్నాయి. తుఫాన్ ప్రభావితమైన ప్రజలు ఏడు వేల 162 మంది. 93 ఇళ్లు దెబ్బ తిన్నాయి. 91 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేస్తే ఏడు 162 మందికి ఆశ్రయం కల్పించారు. 110 కిలోమీటర్ల మేర 58 ఆర్‌అండ్‌బీ రహదారులు దెబ్బ తినగా నష్టం మూడు కోట్ల రూపాయలు. 662 చెట్లు నేలకొరిగాయి.

విరిగిన చెట్లు.. విద్యుత్ స్తంభాలు

తుఫాన్ బీభత్సానికి నరసాపురం, మొగల్తూరు మండలాల్లోని తీర గ్రామాల్లో అంధకారం నెలకొంది. గాలులకు నరసాపురం మండలంలో 120కు పైగా విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. చెట్ల కొమ్మలు పడి 11 కేవీ విద్యుత్ వైర్లు ధ్వంసమయ్యాయి. బుధవారం రాత్రి పలు చోట్ల విద్యుత్ సరఫరా రాక చీకటిలో గడిపారు. స్థానిక విద్యుత్ సిబ్బందితోపాటు కడప నుంచి వచ్చిన సిబ్బంది బృందాలుగా పనులు పునరుద్ధరిస్తున్నారు. 300 మంది నిరంతరం పనిచేస్తున్నా అక్కడక్కడా లైట్లు వెలగని పరిస్థితి. విద్యుత్ శాఖ ముందస్తుగా ఎన్నో జాగ్రత్తలు తీసుకుంది, తుఫాన్ బీభత్సాన్ని అంచనా వేసి వందలాది స్తంభాలు, విద్యుత్ వైర్లు, సిబ్బందిని సిద్ధం చేసింది. కొన్నిచోట్ల గంటల వ్యవధిలోనే సరఫరాను పునరుద్ధరించారు. మండలంలోని రాజుల్లంక, వైఎస్ పాలెం, సీతారాంపురం, తూర్పుతాళ్లు, సారవ, పీఎం లంక, వేములదీవి, బియ్యపుతిప్ప గ్రామాల్లోని ప్రధాన విద్యుత్ వైర్లపై చెట్ల కొమ్మలు పడి తెగిపోయాయి. మొగల్తూరు మండలంలోని గ్రామాలు అంధకారంగా మారాయి. 29 గంటల అనంతరం విద్యుత్ పునరుద్ధరించడంతో గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు. వర్షం లేకపోయినప్పటికి గాలులకు నరసాపురం మండలంలో తరచూ విద్యుత్‌కు అంతరాయం వస్తూనే ఉంది. ఇటు పట్టణంలో సాయంత్రానికి చాలా ప్రాంతాల్లో విద్యుత్‌ను పునరుద్ధరించారు.

పేరు పాలెం, కేపీపాలెం, పీఎం లంక బీచ్‌ల్లో పోలీసులు లేకపోవడంతో సందడి కనిపించింది. పీఎం లంకలోని కేంద్రాన్ని కలెక్టర్ నాగరాణి సందర్శించిన అందిన సౌకర్యాలపై ఆరా తీశారు. ఆమె స్వయంగా వడ్డించి భోజనాలు చేశారు.

ఓ రొయ్యో..
చినలంక వంతెనకు గండి

ముంపులో 1,200 ఎకరాల్లో ఆక్వా చెరువులు.. రైతులకు భారీ నష్టం


తాడు సాయంతో వ్యక్తిని ఒడ్డుకు లాగుతున్న దృశ్యం

నరసాపురం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ పోతూపోతూ బుధవారం రాత్రి చినలంక వంతెనకు గండి పెట్టింది. ఒక్కసారిగా నల్లీ క్రిక్ నీరు పరిసర చెరువులను ముంచి వేసింది. కళ్ల ఎదుటే.. చేతికొచ్చిన ఆక్వా నీటి పాలు అవుతుంటే... రైతులు కన్నీరు కార్చారు. అయితే మరికొందరికి ఇది ఆనందం మిగిల్చింది. వలలతో కొట్టుకుపోతున్న రొయ్యలను పట్టుకుని సంచులు నింపుకున్నారు. చినలంక నుంచి సముద్రానికి వెళ్లే ఈ వంతెన ఇటీవల శిథిలావస్థకు చేరి అక్కడక్కడ గండిపడింది. వంతెన కొట్టుకుపోతే.. సముద్రానికి వేటాడేందుకు వెళ్లే మార్గం ఉండదని మత్స్యకారుల విజ్ఞప్తితో నేతలు కొత్త వంతెనకు నిధులు మంజూరు చేయించారు. పనులు ప్రారంభం కాకుండానే.. పాత వంతెనకు గండిపడింది. ఒక్కసారిగా సముద్రంలోని నీరు ఉప్పుటేర్ల గుండా రావడంతో వంతెన రెండు ముక్కలైంది. దీంతో నల్లీ క్రిక్‌కు అనుకుని ఉన్న 1,200 ఎకరాల చెరువులు కొట్టుకుపోయాయి. అందులో వున్న రొయ్యలన్నీ నీటిపాలయ్యాయి. ఇది కొందరికి ఆనందాన్ని మిగిల్చింది. ఇళ్ల నుంచి వలలు తెచ్చుకుని అయినకాడికి వేటాడుకున్నారు. సమాచారం తెలిసిన వెంటనే కలెక్టర్ నాగరాణి, విప్ నాయకర్, కాపు కార్పొరేషన్ చైర్మన్ సుబ్బారాయుడు, మత్స్యకార అభివృద్ధి చైర్మన్, ఇన్‌ఛార్జ్ పొత్తూరి రామరాజు, డీసీఎంఎస్ చైర్మన్ చాగంటి చిన్న గ్రామాన్ని సందర్శించారు. తక్షణం పనులు చేపడతామని హామీ ఇచ్చారు.

గండి భారీ నష్టం మిగిల్చింది

మూడు ఎకరాలు సాగు చేస్తున్నా. తుఫాన్ కారణంగా రెండు, మూడు రోజుల్లో పట్టుబడి పడదామనుకున్నా. చినలంక వంతెనకు భారీ గండి పడి సమీపంలోని చెరువుల్లోకి నీరు వచ్చి చేరింది. చెరువులన్ని ఏకం కావడంతో అందులోని రొయ్యలు కొట్టుకుపోయాయి. లాభం వస్తుందని అనుకున్నా.. నష్టం చూడాల్సి వచ్చింది. ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలి.

సురక్షితంగా ఒడ్డుకు..

- ఆరుగురిని కాపాడిన ఎస్‌డీఆర్‌ఎఫ్

తుఫాన్‌లో చిక్కుకున్న ఆరుగురిని ఎన్డీఆర్‌ఎఫ్ రక్షించి సురక్షితంగా గట్టు దాటించారు. బుధవారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. చినలంక వంతెనకు గండి పడటంతో అవతల వైపునకు వెళ్లిన ఆరుగురు రైతులు ఆక్వా చెరువుల వద్ద ఉండిపోయారు. వంతెన తెగి నీటి మట్టం పెరుగుతుండటంతో వీరు రోడ్డుపైకి వచ్చే మార్గం లేకుండా పోయింది. రైతులు ఆర్డీవో దాసి రాజుకు ఫోన్ చేశారు. ఆయన అప్రమత్తమై ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందిని అలర్ట్ చేశారు. చినలంక వెళ్లి సిబ్బందితో కలిసి సహాయ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అటువైపు ఉన్న ఆరుగురు రైతులను సిబ్బంది ఒకరి తర్వాత ఒకరిని తాళ్ల సాయంతో గట్టు దాటించారు. దీంతో వారు ప్రాణాలతో బయటపడ్డారు.

ఆక్వా రైతులపై డీజిల్ భారం

ఆకివీడు రూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ఎఫెక్ట్‌తో ఆక్వా రైతులపై డీజిల్ భారం పడింది. ఇప్పటికే అనేక సమస్యలతో అతలాకుతలం అవుతున్న వీరిపై మూలిగే నక్కపై తాటికాయ పడినట్లు అయ్యింది. తుఫాను ప్రభావంతో చెరువుల్లో ఆక్సిజన్ లోపంతో రొయ్యలు విలవిల్లాడుతున్నాయి. మంగళవారం మధ్యాహ్నం నుంచి బుధవారం ఉదయం 11 గంటల వరకు 22 గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో రైతులు జనరేటర్లపై ఆధారపడ్డారు. 40 కేవీ జనరేటర్‌కు ఇందుకు ఎకరానికి మూడు వేలు చొప్పున ఖర్చు అయ్యింది. ఐదెకరాల చెరువు వుంటే రూ.15 వేలు ఖర్చు పెట్టారు. విస్తీర్ణాన్ని బట్టి ఈ ఖర్చు రెండు, మూడింతలు అయ్యింది. డీజిల్ తెచ్చుకునేందుకు రైతులు బంకుల వైపు పరుగులు తీశారు. ఇప్పటికే పది రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల వైరస్, విబ్రియో వంటివి సోకుతాయి. ఇదే ఇప్పుడు రైతులను భయపెడుతోంది. చుట్టుపక్కల నీరు చేరుతుండటం, కాలువలు పొంగి పొర్లుతుండడంతో రైతులు భయాందోళనలకు గురవుతున్నారు.

- విజయకిరణ్, ఆక్వా రైతు

వరికి గండం

- ముంపులో 10,309 ఎకరాలు
- నేలనంటిన 16,072 ఎకరాలు

భీమవరం రూరల్/పెంటపాడు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ సార్వా సాగును నీట ముంచింది. జిల్లాలో పొట్ట దశలో వున్న పది వేల 309 ఎకరాలు ముంపునకు గురైంది. ఈనిక, గింజ పోసుకునే దశలో ఉన్న 16 వేల 72 ఎకరాలు నేలనంటింది. దానిపై వర్షపు నీరు చేరింది. మరో రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో ముంపు మరింత పెరుగుతుంది. ముంపు వల్ల వరికి తెగుళ్ల తలెత్తే ప్రమాదం వుంది. పొడ, ఆకు ముడత, తెల్ల కంకి వంటివి వస్తాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. నేలనంటిన చేలు దిగుబడి సగం వరకు తగ్గిపోతుంది. పూర్తిగా మునిగిన చేలల్లో ముంపు తగ్గిన తర్వాత నష్టం తేలుతుంది.

చేతికి వచ్చింది.. కాని..



చేతికి అందిన పొలం నోటికి అందకుండా తుఫాన్‌కు బలైంది. సార్వా సీజన్‌లో ఏటా రైతులకు ఈ బాధ తప్పడం లేదు. ఇప్పటికే రూ.25 వేల వరకు పెట్టుబడులు పెట్టాం. ఇప్పుడు ఏం చేయాలో తెలియడం లేదు. చేలు పడిపోవడం వల్ల కోత సమయంలో ఎకరానికి మూడు గంటలు పడుతుంది. ఇది అదనపు భారంగా మారుతుంది. ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలి.

వెలగల శ్రీనివాసరెడ్డి, రైతు, పెంటపాడు

వర్షం వస్తే అప్పులే..



నేను 20 ఎకరాల వరకు కౌలు చేస్తున్నాను. ఇప్పటికే ఎకరానికి రూ.20 వేలకుపైగా అప్పుచేసి పెట్టుబడి పెట్టా. పొలం చేతికి వచ్చే సమయంలో తుఫాన్ మా బతుకులపై నీరు కార్చింది. ఇప్పటికైనా ఆగితే పర్వాలేదు. ఇప్పటి వరకు పెట్టిన పెట్టుబడి రాకపోయినా వచ్చిన డబ్బులు కనీసం మగతాకు, మిషన్‌లకు అయినా సరిపోతాయి. ఒకవేళ వర్షం నీరు మొత్తం చేలపై పడిపోతే ఇక మా గతి అంతే.. మొత్తం అప్పులు పాలు అయిపోతాం

అడ్డగర్ల సూర్యనారాయణ, పెంటపాడు


విద్యుత్ స్తంభాలను సరిచేస్తున్న సిబ్బంది


నరసాపురంలో పట్టిన రొయ్యలను ఎగుమతికి సిద్ధం చేసిన రైతులు

భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 28.0
కనిష్ఠం : 24.0

పట్టణాలకు రూ.5 కోట్ల సబ్ ప్లాన్ నిధులు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో మున్సిపాలిటీలకు ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు మంజూరు చేసింది. పట్టణాల్లో ఎస్సీ, ఎస్టీ జనాభా ఉన్న ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు నిధులు వెచ్చించాలి. ఈ మేరకు భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లు, నర్సాపురం మున్సిపాలిటీలతో పాటు, ఆకివీడు నగర పంచాయతీకి రూ. 5 కోట్లు కేటాయించారు. అందులో అత్యధికంగా రూ.2.50 కోట్లు తాడేపల్లిగూడెంకు మంజూరు చేశారు. మిగిలిన మున్సిపాలిటీలు, నగర పంచాయతీకి రూ.50 లక్షలు వంతున విడుదల చేశారు. వీటితో రహదారులు, డ్రెయిన్‌లు నిర్మాణానికి చర్యలు తీసుకుంటారు. ఇప్పటికే పలు మున్సిపాలిటీల్లో టెండర్లు పిలిచారు. సీసీ రహదారులు, డ్రెయిన్ల నిర్మాణానికి పెద్దపీట వేశారు. నిధుల లేమితో ఇబ్బందులు పడుతున్న మున్సిపాలిటీలకు ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు కాస్త ఊరటనిచ్చాయి.

బస్సుల రాకపోకలు యథాతథం

తుపాను రెండు రోజులపాటు రవాణా రంగాన్ని అస్తవ్యస్తం చేసింది. ఆర్టీసీ బస్సులను రద్దు చేసే పరిస్థితి ఏర్పడింది. వానలతో ప్రజలు ప్రయాణాలను రద్దు చేసుకున్నారు. బుధవారం వాతావరణం కాస్త తేరుకోవడంతో వాహనాల రాకపోకలతో రోడ్లపై రద్దీ నెలకొంది.


వరి పనలను పరిశీలిస్తున్న జేసీ రాహుల్

ఐదు రోజుల్లో పంట నష్టం వివరాలు సేకరించాలి

భీమవరం రూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి):మొంథా తుఫాన్ కారణంగా నీట మునిగిన పంటల వివరాలను ఐదు రోజుల్లో సేకరించి నివేదిక సమర్పించాలని వ్యవసాయ శాఖ అధికారులను జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి అధికారులతో గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు. జేసీ మాట్లాడుతూ పడిపోయిన పంట పొలాలు, ముంపునకు గురైన వరి చేల నుంచి నీటిని బయటకు పంపేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పంట నష్టం వివరాలు తెలుసుకునేందుకు రైతు సేవా కేంద్రాల వద్ద సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి రైతును ఆదుకునే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. వ్యవసాయ శాఖ జిల్లా అధికారి జడ్.వెంకటేశ్వరరావు, ఏడీలు, ఎంఏవోలు పాల్గొన్నారు.

నాడు హెలెన్.. నేడు మొంథా

పుష్కరకాలం తర్వాత తీరాన్ని తాకిన తుఫాన్

- నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్న నరసాపురం తీరప్రాంత వాసులు

నరసాపురం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి):తీరాన్ని తుఫాన్లు, సునామీలు వెంటాడుతూనే ఉన్నాయి. గడిచిన 25 ఏళ్లలో మూడు భారీ విపత్తులు తీర ప్రాంత వాసులను కలవరపెట్టాయి. 2004లో నరసాపురం మండలం చినలంక వద్ద సునామీ సృష్టించిన బీభత్సానికి ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. నేటికి సముద్ర కెరటాలు ఎగసిపడుతుంటే.. ఈ తీర ప్రాంత వాసుల్లో ఆనాటి భయాలు గుర్తుకొస్తున్నాయి. సునామీ పేరు చెబితే.. ఆ రాక్షసి అలలను గుర్తు చేసుకుని, గుడ్లు తేలేసే భయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

2013లో హెలెన్ తుఫాన్ బీభత్సం

అప్పటి వరకు తీర ప్రాంత వాసులకు తుఫాన్లు తీరాన్ని దాటడంపై పెద్దగా అనుభవం లేదు. గాలి వానలంటే వాయుగుండం, అల్పపీడనం, వర్షాలు అన్న ఆలోచనే ఉండేది.


ఎగసిపడుతున్న కెరటాలు..


గాలులకు ఊగుతున్న చెట్లు

నేటితరంలో తొలిసారిగా తుఫాన్ బీభత్సం అంటే హెలెన్ ద్వారా కళ్లారా చూశారు. పశ్చిమ బంగాళాఖాతంలో ఏర్పడిన ఈ తుఫాన్ మచిలీపట్నం నుంచి నరసాపురం మధ్య తీరాన్ని దాటింది. ఐఎండీ అంచనా ప్రకారం పీఎం లంక వద్ద ఈ తుఫాన్ తీరం దాటింది. ఆ సమయంలో ఈ తుఫాన్ సృష్టించిన బీభత్సానికి గ్రామస్థులు రెండు రోజులు ఇళ్ల నుంచి బయటకు రాలేదు. గాలులకు వారం రోజులపాటు కరెంటు లేదు. వర్షాలు, ఈదురు గాలులకు వేలాది ఎకరాల్లో పంట నష్టం జరిగింది. అప్పట్లో 130 కిలోమీటర్ల వేగంతో తీరాన్ని తాకింది. అధికారులు ముందస్తు చర్యలు చేపట్టడం వల్ల పెద్దగా ఆస్తి, ప్రాణనష్టం జరగలేదు.

మళ్లీ 12 ఏళ్ల తర్వాత..

మొంథా తుఫాన్ మంగళవారం రాత్రి తీరాన్ని తాకింది. వారం రోజుల నుంచి తీర ప్రాంతవాసులు ఆందోళన చెందారు. కాకినాడ వద్ద తీరం దాటుతుందన్న వాతావరణ శాఖ హెచ్చరికతో ఊపిరి పీల్చుకున్నారు. కాని, మంగళవారం సాయంత్రం నుంచి నరసాపురం వద్ద తీరం దాటవచ్చన్న సమాచారంతో ఒక్కసారిగా ఉలిక్కి పడ్డారు. హెలెన్ తుఫాన్ బీభత్సాన్ని గుర్తు చేసుకున్నారు. గండం నుంచి గట్టెక్కించాలని గంగమ్మను వేడుకున్నారు. స్వచ్ఛందంగా తుఫాన్ కేంద్రాలకు తరలి వచ్చారు. చివరకు హెలెన్‌తో పోలిస్తే దీని ప్రభావం అంతగా లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. పంటలకు పెద్దగా నష్టం లేకపోవడం, ఎటువంటి విపత్తు సృష్టించకపోవడంతో గంగమ్మ రక్షించిందని పూజలు చేశారు. మరో అధికార యంత్రాంగం ముందస్తు చర్యలు ఊరటనిచ్చాయి.



ఆకివీడులో హైవేపై పడిన వృక్షం తొలగింపు చేస్తున్న సీఐ జగదీశ్వరరావు.. దెందులూరులో పడిన చెట్ల తొలగిస్తున్న సిబ్బంది


యలమంచిలిలో నీటమునిగిన వరి పంట



సీతారామపురం కాల్వగట్టు వద్ద పడిన భారీ చెట్టు.. పెనుగొండ మండలం కొరాలపర్రు వద్ద విరిగిపడిన తాటిచెట్టు

మొంథా విలయం

ఉమ్మడి పశ్చిమ జిల్లాలో మొంథా తుఫాన్ ప్రభావం కనిపించింది. ఈ మేరకు వరి పంటలు నేలవాలాయి. అరటితోటలు ధ్వంసమయ్యాయి. తాటిచెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. బుధవారం పలు చోట్ల పడిన చెట్ల తొలగింపు పనులు, విద్యుత్ పునరుద్ధరణ పనుల్లో అధికారులు, సిబ్బంది నిమగ్నమయ్యారు.


పోలవరం మండలం గుంజవరంలో తెగిపడిన విద్యుత్ తీగలు


దెందులూరులో పడిన అరటి తోట


కలవపూడి- మోడి రహదారిలో వాలిన స్తంభం


తణుకు- అజ్జరం కాలనీలో విరిగిన చెట్టు తొలగిస్తున్న సిబ్బంది


ద్వారకాతిరుమల మండలం ఎం.నాగులపల్లిలో ధ్వంసమైన అరటి తోటల వద్ద రైతులు


నరసాపురం మండలం చినలంక నల్లీ క్రీక్ వద్ద ఆక్వా చెరువులు మునిగి పోవడంతో వలలు వేసి రొయ్యల వేట సాగిస్తున్న మత్స్యకారులు


ఆచంటలో పడిపోయిన పంట పొలాలను పరిశీలిస్తున్న అధికారులు


ఉండి సివిల్ సప్లయిస్ గోడౌన్ స్టోర్‌పై కూలిన చెట్టు


నరసాపురం మండలం సీతారామపురం కాల్వగట్టు వెంబడి వున్న గుడిసెపై పడిన భారీ చెట్టు


పెనుగొండ మండలం కొరాలపర్రులో నేల వాలిన వరి చేలు

పునరావాసాలు భేష్

పనితీరుపై నిర్వాసితులు సంతృప్తి

▸ పిల్లలకు పాలు, వైద్యం, మంచి ఆహారం


పీఎంలంక పునరావాస కేంద్రంలో భోజనాలు

నరసాపురం రూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తుఫాన్ బీభత్సానికి ప్రాణనష్టం జరగకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాసాలను నిర్వసితులు కితాబులు కురిపిస్తున్నారు. మూడు రోజుల పాటు మంచి సౌకర్యాలు అందించారని అధికారుల్ని ప్రశంసిస్తున్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా ఎక్కువ మందిని పునరావాస కేంద్రాలకు తరలించిన ప్పటికి ఎవరికి ఎటువంటి లోటు రాకుండా సౌకర్యాలు కల్పించడంలో అధికార యంత్రాంగం సఫలీకృతమైంది. నరసాపురం, మొగల్తూరు మండలంలో 19 కేంద్రాలు ఏర్పాటు చేసి సుమారు పది వేల మందిని తరలించారు. అందులో అత్యధికంగా పీఎంలంక గ్రామంలో రెండు వేల మంది తలదాచుకున్నారు. అన్ని కేంద్రాల్లో ఉదయం అల్పాహారం, టీతో పాటు మధ్యాహ్నం, సాయంత్రం భోజనం కల్పించారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. గర్భిణులు, వృద్ధుల పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నారు. పిల్లలకు పాలు అందించారు. అన్ని కేంద్రాల్లో మంచినీరుతో పాటు జనరేటర్ ఏర్పాటు చేసి విద్యుత్‌కు అంతరాయం లేకుండా చూశారు. ఒక్కొక్క కేంద్రం వద్ద ఒక్కో మండల అధికారికి బాధ్యతలు అప్పగించారు. బుధవారం సాయంత్రంతో వీటిని మూసివేశారు.

ప్రత్యేక శ్రద్ధ చూపారు..



గతంలో అనేక మార్లు పునరావాస కేంద్రాలకు వచ్చాం. కానీ ఎప్పుడు ఇలా చూడలేదు. ఈసారి ప్రత్యేక శ్రద్ధ చూపించారు. మంచి ఆహారంతో పాటు మందులు అందించారు. ఇక్కడికి రావడం వల్ల భయం పోయి.. నలుగురితో కలిసి ఉన్నాం.

– తిరుమాని నాగలక్ష్మి, పీఎంలంక, నరసాపురం


పునరావాస కేంద్రంలో భోజనం వడ్డిస్తున్న ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు

ధర్మాజీగూడెం పునరావాస కేంద్రంలో డిప్యూటీ కమిషనర్ పరిశీలన

లింగపాలెం, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి):పునరావాస కేంద్రాలలో రుచి కరమైన భోజనాన్ని, నిరంతరం మంచినీటిని అందించాలని, చిన్నారులకు పాలు అందించాలని ఏలూరు జిల్లా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్(స్పెషల్ ఆఫీసర్) పి.శ్రీనివాసరావు అన్నారు. లింగపాలెం మండలంలోని ధర్మాజీగూడెంలోని పునరావాస కేంద్రాన్ని తహసీల్దార్ నజీముల్లాషాతో కలిసి ఆయన పరిశీలించారు. పునరావాసంలో ఆశ్రయం పొందుతున్న వారిని పలకరించి వారికి అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఇంకా వర్షాలు కురుస్తుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గురువారం ఉదయం అల్పాహారం ముగిసిన తరువాత పునరావాసం నుంచి ఇళ్లకు వెళతారని తెలిపారు. పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు ఉన్నారు.

ప్రతి రైతును ఆదుకుంటాం

▸ 3,422 మందిని పునరావాసానికి తరలించాం ▸ నేటిలోగా నష్టాలపై నివేదిక ఇవ్వండి : ఏలూరు జిల్లా ఇన్‌చార్జి మంత్రి మనోహర్

ఏలూరు/పెదపాడు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): 'జిల్లాలో మొంథా తుఫాన్ నేపథ్యంలో 90 పునరావాస కేంద్రాలకు 3,422 మంది తరలించి సహాయక చర్యలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాం. జిల్లా యంత్రాంగం తీసుకున్న ముందస్తు చర్యలు వల్ల తుఫాన్‌ను సమర్ధవంతంగా ఎదుర్కొన్నాం. విపత్తు నివారణకు యంత్రాంగం మనస్సు పెట్టి చేసింది' అని జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఏలూరు జిల్లాలో చేపడుతున్న కార్యక్రమాలపై బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలోని 408 గ్రామ, వార్డు సచివాలయాల్లోని సిబ్బందితో టెలీకాన్ఫరెన్స్ ద్వారా జిల్లా యంత్రాంగం క్షేత్రస్థాయిలో సమస్యలు తెలుసుకుని ముందస్తు చర్యలు తీసుకుందన్నారు. తుఫాన్ బాధితులు సహాయ కేంద్రం నుంచి వెళ్లే సమయంలో కుటుంబానికి 25 కేజీల బియ్యం, కందిపప్పు, పంచదార, వంటనూనె, రెండు రకాల కూరగాయలు కిలో చొప్పున అందిస్తామన్నారు. చేనేత కార్మికులు, మత్స్యకార కుటుంబాలకు అదనంగా 25 కేజీల బియ్యం అందిస్తామన్నారు.

నష్టాలపై నివేదిక అందించండి..

జిల్లాలో వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధకశాఖ, ఆక్వా రంగానికి కలిగిన నష్టాలపై ఈనెల 30 తేదీలోగా నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించామన్నారు. సమావేశంలో కలెక్టర్ కె.వెట్రి సెల్వి, ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, ఆర్టీసీ చైర్మన్ రీజనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, డీఆర్‌వో వి.విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

ఏపూరు పునరావాస కేంద్రం సందర్శన..

పెదపాడు మండలం ఏపూరు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌తో కలిసి బుధవారం ఆయన సందర్శించారు. ఎమ్మెల్యే చింతమనేని మాట్లాడుతూ శివారు ప్రాంతాల్లో రేకులషెడ్లు, పూరిపాకల్లో నివసిస్తున్న 32 కుటుంబాలకు చెందిన 96 మందిని పునరావాస కేంద్రానికి తరలించి వసతి, భోజన ఏర్పాట్లు చేశామన్నారు. అనంతరం పునరావాస కేంద్రాల నుంచి తిరిగి ఇంటికి వెళ్లే కుటుంబాలకు 25 కేజీలు బియ్యం, నిత్యావసర సరుకులు, బాధిత మనిషికి రూ.వెయ్యి, కుటుంబానికి రూ.3 వేలు చొప్పున నగదు పరిహారాన్ని అందజేశారు. ఆర్డీవో అచ్యుత అంబరీష్, డీఎస్‌వో ఈబీ విలియమ్స్, జిల్లా వ్యవసాయశాఖ జేడీ షేక్ హబీబ్ బాషా, తదితరులు పాల్గొన్నారు.


ఏపూరులో బాధితులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల, ఎమ్మెల్యేలు చింతమనేని, పత్సమట్ల, కలెక్టర్ వెట్రిసెల్వి తదితరులు

అధికారులతో మంత్రి మనోహర్ సమీక్ష

ఏలూరు సిటీ : ఏలూరు జిల్లాలో నిర్వహించిన తుఫాన్ సహాయక కార్యక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ కార్యదర్శి, తుఫాను సహాయక కార్యక్రమాల జిల్లా ప్రత్యేకాధికారి కాంతిలాల్ దండే, జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వితో కలిసి జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభు త్వ యంత్రాంగం తీసుకున్న ముందస్తు జాగ్రత్త చర్యలతో మొంథా తుఫాన్‌ను సమర్థవంతంగా ఎదుర్కోగలిగామన్నారు. జిల్లా మంత్రి కొలుసు పార్థసారథి, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఇతర స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, కూటమి పార్టీ నేతలు క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారని, వీటిని అధికారులు పరి ష్కరించడంతో నష్టాన్ని నివారించగలిగామన్నారు. జిల్లా ప్రత్యేకాధికారి కాంతిలాల్ దండే మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం ముందస్తు జాగ్రత్తలతో నష్టాలను తగ్గించగలిగామని అధికారులను అభినందించారు. కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ మంత్రులు, ప్రజాప్రతినిధులు, తుఫాన్ ప్రత్యేకాధికారులు అందించిన సూచనలతో తుఫాన్‌కు ముందుగానే ప్రజలను సహాయక కేంద్రాలకు తరలించడంతో ప్రాణనష్టం సంభవించలేదన్నారు.

రైతులందరిని ఆదుకుంటాం

తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులందరిని ప్రభుత్వపరంగా అన్నివిధాలుగా ఆదుకుంటామని ఇన్‌చార్జి మంత్రి మనోహర్ తెలిపారు. తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన పంటలను పెదపాడు మండలం వట్లూరులో బుధవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతులు వరిదుబ్బులను చూపించి, తమ బాధలను వ్యక్తం చేసి ఆదుకోవాలని కోరారు. మంత్రి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తామని భరోసా ఇచ్చారు.



వాండ్రంలంకలో వరి దుబ్బులను పరిశీలిస్తున్న డిప్యూటీ స్పీకర్, కలెక్టర్

రైతులకు అండగా నిలుస్తాం

▸ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు

ఉండి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి):రైతులకు అండగా నిలుస్తామని రానున్న రెండు మాసాలలో డ్రెయిన్లు, కాలువలు, ఇతర ఆక్రమణలను తొలగించి నీటిపారుదల మెరుగుగా ఉండేలా చర్యలు తీసుకుంటామని డిప్యూటి స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణంరాజు అన్నారు. ఉండి మండలం వాండ్రంలంకలో తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న వరిచేలను బుధవారం కలెక్టరు నాగరాణితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉండి నియోజకవర్గంలో 80 శాతం మేర డ్రెయిన్లు, కాలువలపై ఆక్రమణలను తొలగించి నీటిపారుదల వ్యవస్థను స్థిరీకరించామన్నారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా తదుపరి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కులమతాలకు అతీతంగా ఆక్రమణలు తొలగిస్తామన్నారు. కౌలు రైతులకు సీసీఏ కార్డుల మంజూరులో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకునేందుకు వ్యవసాయ అధికారులను ఆదేశించారు. గ్రామంలోని 900 ఎకరాలకు గాను 50ఎకరాల వరి పంట నేలకొరిగిందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో పాలకోడేరు బ్యాంక్ చైర్మన్ కొత్తపల్లి నాగరాజు, సర్పంచ్ దాసరి వెంకటకృష్ణ, తోట ఫణిబాబు, కందుల బలరాం, కరిమెరక నాగరాజు, కాగితబుజ్జి, అప్పల కృష్ణ, సూరవరపు వెంకటాచార్యులు, జిల్లా వ్యవసాయాధికారి జడ్.వెంకటేశ్వర్లు, తహసీల్దార్ నాగార్జున, ఏడీఏ జీవన్ ప్రతాప్, ఏవో శ్రీనివాస్, వీఆర్‌వో చిన్నారావు, గ్రామ కార్యదర్శి నాయుడు పాల్గొన్నారు.

పెరిగిన ఉప్పుటేరు నీటిమట్టం


ఆకివీడు వద్దఉధృతంగా ప్రవహిస్తున్న ఉప్పుటేరు

ఆకివీడు రూరల్/తణుకు రూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కొల్లేరులోని నీటిని సముద్రంలోకి తీసుకెళ్లే ఏలూరు-పశ్చిమ గోదావరి జిల్లాల మధ్య వున్న ఉప్పుటేరులో నీటి మట్టం పెరిగింది. వంతెన వద్ద వున్న సూచికలో 1.90 మీటర్లుగా నమోదైంది. తుఫాన్ ప్రభావంతో ఉప్పుటేరులో నీటి ప్రవాహం తక్కువగా ఉంది. గురువారానికి అవుట్ ఫ్లో పెరిగి నీటిమట్టం త్వరగా తగ్గుతుందని డ్రెయినేజి ఏఈ ప్రసాద్ తెలిపారు. ఉప్పుటేరు బ్యాక్ వాటర్ వల్ల సిద్ధాపురం, మాదివాడ, అగ్రహారం, చినిమిల్లిపాడు గ్రామాల వరి పొలాలకు ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు.

వయ్యేరులో అదే ఉధృతి

భారీ వర్షాల కారణంగా తణుకు రూరల్ మండలం దువ్వ వయ్యేరుకు వరద నీరు చేరడంతో ప్రవాహం ఉధృతంగా వుంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షపు నీరు పలు జలాశయాలలో చేరి ఎర్ర కాలువకు, అక్కడి నుంచి దువ్వ వయ్యేరులోకి వస్తోంది. దీని నుంచి యనమదుర్రు డ్రెయిన్ ద్వారా సముద్రంలోకి వెళుతుంది. దువ్వ వయ్యేరు గట్టుపై నివసించే సంచార ప్రజలను స్థానిక పునరావాస కేంద్రానికి తరలించారు.


దువ్వలో ఉధృతంగా ప్రవహిస్తున్న వయ్యేరు

బోధనాసుపత్రుల్లో ఉచిత వైద్యచికిత్సలు కొనసాగింపు


ఆశ్రంలో ఉచిత వైద్యసేవలను పరిశీలిస్తున్న డాక్టర్ రాజీవ్

ఏలూరు అర్బన్, అక్టోబరు 29 (ఆంధ్ర జ్యోతి): బకాయిలు చెల్లించాలంటూ ఎన్టీఆర్ వైద్య సేవ నెట్‌వర్క్ ఆసుపత్రులు గతకొన్ని రోజులుగా ఉచిత వైద్యచికిత్సలను నిలిపివేసిన నేపథ్యంలో ఆయా ప్రైవేటు ఆసుప త్రుల్లో రోగులకు అందుతున్న వైద్యసేవలను బుధవారం ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ రాజీవ్ పరిశీలించారు. ఏలూరు ఆశ్రం వైద్యకళాశాల బోధనాసుపత్రిలో ఎన్టీఆర్ వైద్యసేవకింద ఇన్‌పేషెంట్లుగా చేరిన రోగులతో ఆయన మాట్లాడారు. మొంథా తుఫాన్ ప్రభావంతో ఏర్పడిన పరిస్థితుల నేపథ్యంలో ఉచిత వైద్యచికిత్సలను నిలిపివేయాలనే ఆలోచనను తాత్కాలికంగా విరమించుకున్నామని వైద్యకళాశాల యాజమాన్యం తెలియజేసిందన్నారు. తుఫాన్ కారణంగా మానవతాదృక్పథంతో మిగిలిన నెట్‌వర్క్ ఆసుపత్రులు కూడా ఉచిత వైద్యచికిత్సలను అందించాలని కోరుతున్నామన్నారు. ఆ మేరకు ఏలూరులోని మూడు నెట్‌వర్క్ ఆసుపత్రుల యాజమాన్యాలను గురువారం కలిసి అభ్యర్థిస్తామన్నారు. ఉచిత వైద్యచికిత్సలను నిలిపివేసినప్పటికీ సంబంధిత ఆసుపత్రులకు వచ్చే రోగులకు ఇబ్బందులు తలెత్తకుండా ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు నేతృత్వంలో ప్రత్యామ్నాయ ఆసుపత్రులకు తీసుకెళ్లేందుకు వీలుగా అంబులెన్సులు, వైద్యమిత్రలను అందుబాటులో ఉంచామన్నారు.

నరసాపురం డీఎస్పీ శ్రీవేదకు అరుదైన గౌరవం

» 31న గుజరాత్‌లో పోలీస్ పరేడ్‌కు నాయకత్వం


డాక్టర్ శ్రీవేద

నరసాపురం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): నరసాపురం డీఎస్పీ డాక్టర్ శ్రీవేదకు అరుదైన గౌరవం దక్కింది. గుజరాత్‌లోని కేవాడీ వద్ద ఈనెల 31న నిర్వహించే పోలీస్ పరేడ్‌లో ఆంధ్రప్రదేశ్ పోలీస్ బృందం డీఎస్పీ శ్రీవేద నాయకత్వం వహించనున్నారు. సర్దార్ జయంతిని పురస్కరించుకుని ఏకతా దివాస్ పరేడ్‌ను కేంద్రం నిర్వహిస్తుంది. దీనికి అన్ని రాష్ట్రాల నుంచి పోలీస్ బృందాలు శిక్షణకు తరలివెళ్లాయి. రాష్ట్రం నుంచి పోలీస్‌లు, అధికారులు వెళ్లి శిక్షణ పొందుతున్నారు. డీఎస్పీ శ్రీవేద గత కొద్దిరోజుల నుంచి అక్కడే ఉండి శిక్షణ పొందుతున్నారు. ఆమె చూపిన ప్రతిభను గుర్తించిన ఉన్నతాధికారులు ఏపీ పోలీస్ పరేడ్‌ను లీడ్ చేసే బాధ్యతల్ని అప్పగించారు. ఏడాది క్రితమే డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఆమె స్వల్పకాలంలో ఈ అరుదైన గౌరవాన్ని దక్కించుకోవడంపై పోలీస్ అధికారులు అభినందనలు వ్యక్తం చేశారు.

'విద్యార్థులు సాంకేతిక రంగాల్లో రాణించాలి'


జ్యోతి ప్రజ్వలనలో అతిథులు, ఆచార్యులు

తాడేపల్లిగూడెం అర్బన్, అక్టోబరు29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సాంకేతిక రంగాల్లో పట్టు సాధించాలని మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ ఫార్మర్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వివేకానంద అన్నారు. తాడేపల్లిగూడెం ఏపీ నిట్‌లో బుధవారం జ్యోతి ప్రజ్వలన చేసి టెడ్ ఎక్స్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశలను అవకాశాలుగా మార్చుకునే సాధనమే ఆధునిక టెక్నాలజీ అన్నారు. అనంతరం సీఈవో అవినాశ్ మాట్లాడారు. ఎలికో హెల్త్ సర్వీస్ ఎండీ డాక్టర్ వనిత, ఐఐటీ ఆచార్యులు డాక్టర్ పట్టాభిరామన్ ఆన్‌లైన్ ద్వారా మాట్లాడారు. అనంతరం అతిథులను శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు. డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ డాక్టర్ హిమబిందు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి కో-ఆర్డినేటర్‌గా అసోసియేట్ డీన్ డాక్టర్ రాజేశ్వరెడ్డి అర్గనైజర్‌గా వయ్యావుల కృష్ణప్రియ, కో-అర్గనైజర్‌గా వేందాతరెడ్డి వ్యవహరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ దినేష్‌శంకర్‌రెడ్డి, డీన్ లు, ఆచార్యులు పాల్గొన్నారు.

పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ ఈఈల సీనియారిటీ జాబితా

అమరావతి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పబ్లిక్ హెల్త్ అండ్ మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగంలోని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల సీనియారిటీ జాబితాను ప్రకటిస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీచేసింది. పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ విభాగంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల సీనియారిటీ జాబితాను తయారుచేసి ఇప్పటికే ఆయా ఇంజనీర్ల నుంచి అభ్యంతరాలను స్వీకరించి తుది జాబితాను ఇంజనీర్-ఇన్-చీఫ్ రూపొందించారు. ఈ సీనియారిటీ జాబితాను ఆమోదించేందుకు ప్రభుత్వ అనుమతిని కోరగా ఆ మేరకు మున్సిపల్ శాఖ 48 మందితో కూడిన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల సీనియారిటీ జాబితాకు ఆమోదం తెలుపుతూ ఉత్తర్వులు జారీచేసింది.

విద్యార్థులకు లెటర్ రైటింగ్ పోటీలు

ఏలూరు అర్బన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో లెటర్ రైటింగ్‌ను ప్రోత్సహించే లక్ష్యంలో భాగంగా ధాయ్ ఆఖర్ లెటర్ రైటింగ్ పోటీ-2025ని నిర్వహిస్తున్నట్టు ఏలూరు డివిజన్ పోస్టాఫీసుల సూపరింటెండెంట్ ఎస్.శ్రీకర్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు. 'లెటర్ టు మై రోల్‌మోడల్' అనే అంశంపై నిర్వహించే పోటీని 18ఏళ్లలోపు, అంతకుపైబడిన వయస్సు విద్యార్థులకు రెండువిభాగాల్లో రాష్ట్ర, జాతీయస్థాయిల్లో పోటీలు డిసెంబరు ఎనిమిదో తేదీ వరకు జరుగుతాయన్నారు. విద్యార్థులు రూ.5 ఎన్వలప్ కవర్ కేటగిరీ కింద వెయ్యి పదాలకు మించకుండా ఏ-4 సైజు కాగితంపై లేదా రూ2.50 పైసల ఇన్‌ల్యాండ్ లెటర్ కేటగిరీ కింద 500 పదాలకు మించ కుండా లేఖనురాసి నిర్ణీత గడువుతేదీలోగా పంపాలని సూచించారు. చేతితో రాసిన లేఖలు మాత్రమే పంపాలని, ఈ ఏడాది జనవరి ఒకటో తేదీ నాటికి 18 ఏళ్ల లేదా అంతకుపైబడి వున్నట్టుగా ధ్రువీకరిస్తూ స్పష్టంగా రాయాలని కోరారు. పోటీకి అవసరమైన స్టేషనరీ అన్ని పోస్టాఫీసుల్లో అందుబాటులో ఉంచామన్నారు. లేఖలను సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసెస్, ఏలూరు డివిజన్, ఏలూరు-534007 చిరునామాకు పంపాలని సూచించారు. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో తొలి మూడుస్థానాల్లో నిలిచిన వారికి నగదు బహుమతులు అందిస్తారన్నారు.

లక్ష్మీ గణపతికి అరటి పండ్లతో అర్చన



ఏలూరుకార్పొరేషన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం రెండో బుధవారం పురస్కరించుకుని సత్రంపాడులోని దేవదాయ శాఖ ఆధ్వర్యంలో శ్రీలక్ష్మీగణపతి స్వామి ఆలయం వద్ద భక్తులు స్వామికి అరటిపండ్లతో అర్చనలు జరిపారు. అర్చకులు స్వామికి పంచామృతాభిషేకం జరిపి ప్రత్యేక అలంకరణలో భక్తజనానికి దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా స్వామివారి సన్నిధిలో భక్తులు కార్తీక దీపాలను వెలిగించి ఆరాధించారు.


ఆకివీడులో నిలిచిన ట్రాఫిక్ (ఫైల్)


నిత్యం రద్దీగా ఉంటున్న ఆచంట కచేరి సెంటర్ (ఫైల్)

చక్రబంధం

ఆకివీడులో ట్రాఫిక్ సమస్య రానురాను తీవ్రమవుతోంది. ఆకివీడు మీదుగా వెళ్లే వాహనాలు సంఖ్య గణనీయంగా పెరిగింది. పేరుకు జాతీయ రహదారి అయినా పట్టణ పరిధిలో కుంచించుకుపోయి కనీసం రెండు వాహనాలు తప్పుకొనే పరిస్థితి లేదు. ఒక పక్క రహదారి విస్తరణకు నోచుకోకపోవడం, మరో పక్క రోడ్డు ఆక్రమణలు సమస్యకు కారణం అవుతున్నాయి.

(ఆకివీడు-ఆంధ్రజ్యోతి)

» ఆకివీడులో వాహనాల రద్దీ
» యథేచ్ఛగా పార్కింగ్, ఆక్రమణలు
» ట్రాఫిక్ వెతలతో ప్రజల పాట్లు
» రహదారి విస్తరించాలని వినతి

ఆకివీడులో ట్రాఫిక్ సమస్య పరిష్కరించే దిశగా వెంకయ్యవయ్యేరు గట్టు వెంబడి ఉన్న రెండు కిలో మీటర్ల మినీ బైపాస్ రోడ్డు గత టీడీపీ ప్రభుత్వంలో కొంతమేర రూ.1.50 కోట్లతో నిర్మాణం పనులు పూర్తి చేశారు. మిగిలిన ఉన్న రోడ్డు అభివృద్ధికి నోచుకోలేదు. దీంతో ఈ రోడ్డును పూర్తిస్థాయిలో వినియోగించడం మానేశారు. అయి తే ఇటీవల డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు తాత్కాలిక చర్యలు చేపట్టడంతో ట్రాఫిక్‌ను నివారించేందుకు పోలీసులు ఈ రోడ్డు గుండా వాహనాలు కొన్ని రోజులు మళ్లించి వదిలేశారు. ఉదయం సాయంత్రం పాఠశాలలు, కళాశాలల బస్సులు, హైదరాబాద్, బెంగుళూరు బస్సులు రాకపోకలు, ఊక లారీలు, ధాన్యం, బియ్యం లోడు లారీలు, దుకాణాలకు వచ్చిన సరుకుల లారీలు రహదారిపైనే ఉంచి ఎగుమతులు, దిగుమతులు చేయడంతో తీవ్ర ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది.

అవరోధాలు తొలగించాలి

నగర పంచాయతీ పరిధిలో ప్రధానంగా గుమ్ములూరు సెంటర్, మాదివాడ నుంచి ఎఫ్‌సీఐ వరకూ ఉన్న రహదారి మార్జిన్లు ఖాళీ చేయించాలి. తోపుడు బండ్లు, ఆటోలు, ఇతర వాహనాలతో ఆయా ప్రాంతాలు ఇరుకుగా మారుతుండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వాణిజ్య సంస్థలకు సంబంధించి ఏర్పాటుచేసిన బోర్డులు, ఎండ నుంచి రక్షణకు ఏర్పాటు చేసుకున్న సన్‌షెడ్‌లు తొలగించాలి.

రహదారి విస్తరణ ముఖ్యం

పట్టణ పరిధిలో 165 జాతీయ రహదారి విస్తరించకపోవడంతో ట్రాఫిక్ సమస్య పరిష్కారం కష్టతరంగా మారుతోంది. ఈలోగా మినీ బైపాస్ రోడ్‌ను వినియోగించుకుంటే కొంతమేర ఉపయోగంగా ఉంటుంది. పట్టణంలో ఆక్రమణలు తొలగించి పార్కింగ్ సదుపాయం కల్పిస్తే మరి కొంత ట్రాఫిక్‌ను నివారించవచ్చు. నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులపై చర్యలు తీసుకోవాలి. జాతీయ రహదారి విస్తరణ జరగకపోతే తరచూ ప్రమాదాలు తప్పవు.

ఆచంట కచేరి సెంటర్‌కు మోక్షమెప్పుడో..

నిత్యం వాహనాల రద్దీ.. పట్టించుకోని అధికారులు

ఆచంట: ఆచంట కచేరి సెంటర్ నుంచి అనేక వాహనాలు మార్టేరు, సిద్ధాంతం, పాలకొల్లు వైపు నిత్యం వెళుతుంటాయి. ఈ సెంటర్‌లో ఒక్క వాహనం ఆగినా పదుల సంఖ్యలో వాహనాలు నిలిచి ట్రాఫిక్ జామై వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. నిరంతరం రద్దీ ఉన్నప్పటికి ఏ అధికారి పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. ట్రాఫిక్ పోలీస్ కనిపించరు. గతంలో రోడ్డు విస్తరణ పనులు నిలిచిపోవడంతో మరింత రద్దీ ఏర్పడింది. అధికారులు స్పందించాలి మరి!

రహదారి విస్తరించాలి



పీక్ సమయంలో జనం నరకం చూస్తున్నారు. వాహనాలు తప్పించలేక ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. గంటల కొద్దీ ట్రాఫిక్ వలయంలో చిక్కుకుంటున్నారు. అత్యవసరంగా రోగులను తరలించాల్సి వస్తే అంతే సంగతులు.

-దాసరి బాలకృష్ణ, ఏఎంసీ డైరెక్టర్, ఆకివీడు

ఫోర్ లైన్స్‌గా చేయాలి



జాతీయ రహదారిని ఫోర్ లైన్స్‌గా విస్తరించాలి. రహదారికిరువైపుల ఆక్రమణల వల్ల తరచూ ట్రాఫిక్ నిలవడడమే కాక ప్రమాదాలు జరుగుతున్నాయి. జాతీయ రహదారికి మధ్యలో డివైడర్ ఏర్పాటు చేసి ట్రాఫిక్ పోలీసులను నియమించాలి.

-డీవీ రమణమూర్తి, సాంఘిక న్యాయవేదిక కన్వీనర్, ఆకివీడు

ట్రాఫిక్ నియంత్రిస్తాం..



ట్రాఫిక్ నివారణకు చర్యలు చేపడుతున్నాం. జాతీయ రహదారికి ఇరువైపుల ఆక్రమణలు తొలగింపుకు కృషి చేస్తున్నాం. దుకాణాల దగ్గర వాహనాలు నిలపడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. పార్కింగ్ ఏర్పాటుకు కృషి చేస్తున్నాం.ప్రజానీకం స హకరించాలి.

-జి.కృష్ణమోహన్, నగర పంచాయతీ కమిషనర్, ఆకివీడు

సమస్య పరిష్కరిస్తాం..



ఆకివీడు పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నాం. జాతీయ రహదారిపై భారీ వాహనాల సంఖ్య పెరిగింది. మినీ బైపాస్ రోడ్డు గుండా వాహనాలు మళ్లించేందుకు చర్యలు చేపట్టాం. ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు తీసుకున్నాం.

-హనుమంతు నాగరాజు, ఎస్ఐ, ఆకివీడు

తుఫాన్ దెబ్బకు
కూరగాయల ధరలకు రెక్కలు

» వంగ కిలో రూ. 100.. » బెండ రూ. 80



తాడేపల్లిగూడెం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ఎఫెక్ట్‌తో కూరగాయల ధరలు ఆకాశాన్నంటాయి. తుఫాన్ ప్రభావంతో పాటు కార్తీక మాసం కారణంగా ధరలు బాగా పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. తుఫాన్ ప్రభావంతో రెండు రోజులుగా కూరగాయలు మార్కెట్‌కు రావడం తగ్గింది. వాతావరణం మార్పులతో కూరగాయలు దిగుబడి కూడా తగ్గింది. ఇదే సమయంలో కూరగాయలకు డిమాండ్ ఏర్పడటంతో వ్యాపారులు ధరలను పెంచేశారు. గత వారం కిలో రూ.50 ఉండే బీర ఇప్పుడు రూ. 80కు చేరింది. రెండు వారాల కిందట రూ.20 అంటే కొనుగోలు చేయని బెండ ఇప్పుడు రూ.80కు చేరింది. దొండ, దోస కిలో రూ.60కు విక్రయిస్తున్నారు. కాకర రూ.60, బంగాళా దుంపలు రూ.50, వంకాయలు కిలో రూ.100 మార్కుకు చేరింది. టమాటా రూ.50, చిక్కుళ్లు రూ.130, క్యారెట్ రూ.80, బీట్‌రూట్ రూ.80 అమ్మారు. వీటి ధరలను చూసి ఒక కిలో తీసుకెళ్లేవారు అర కిలో, పావు కిలోలకే పరిమితమయ్యారు.

ఉల్లి ధరా పెరిగింది..

ఉల్లి ధర కిలోకు రూ.5 వంతున పెరిగింది. మొన్నటి వరకు మధ్యరకం ఉల్లి కిలో రూ. 20కు రిటైల్‌గా అమ్మేవారు. ఇప్పుడు కిలో రూ.25కు పెరిగింది. పెద్దసైజు ఉల్లి రూ.100కు 3కిలోలు వంతున అమ్మారు. వర్షాలకు మహారాష్ట్ర ఉల్లి తక్కువగా రావడంతో ధర పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు. ఇప్పటికే కర్నూలు, కడప నుంచి ఉల్లి రావడం ఆగింది. ఇక పెద్ద దిక్కుగా ఉన్న మహారాష్ట్ర ఉల్లిపైనే అందరూ ఆధారపడ్డారు. మొన్న వారం మార్కెట్లోకి నాఫెడ్ నుంచి ఉల్లి వచ్చింది. ప్రస్తుతం మార్కెట్‌కు రావడం తగ్గింది. బుధవారం తాడేపల్లిగూడెం మార్కెట్‌కు నాఫెడ్ నుంచి 2 లారీల్లో సుమారు 60 టన్నుల ఉల్లి వచ్చింది. క్వింటా రూ.1400 నుంచి 1500 మధ్య హోల్‌సేల్‌గా విక్రయించారు. ఇక మహారాష్ట్ర నుంచి కేవలం ఒక్క లారీలో సుమారు 30 టన్నులు వచ్చింది. హోల్‌సేల్‌గా క్వింటాలు రూ.2000 నుంచి రూ.2300కు అమ్మారు.


ఏలూరులో ఉద్యోగుల నిరసన

చిత్తూరులో అధికారి దురుసు ప్రవర్తనపై నిరసన

ఏలూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): చిత్తూరు వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ రవీంద్రనాథ్ రెడ్డి కింద స్థాయి ఉద్యోగులపై దురుసుగా ప్రవర్తించడాన్ని నిరసిస్తూ నగరంలోని పెరుగుచెట్టు సెంటర్‌లో వాణిజ్య పన్నులశాఖ ఏసీ-2 కార్యాలయం వద్ద బుధవారం ఉద్యోగులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఉద్యోగులను కించ పర్చే విధానాన్ని అధికారులు విడనాడాలని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఉద్యోగులు ముక్తకంఠంతో కోరారు. అధికారులు, సిబ్బంది కలిసి పనిచేసి శాఖకు మంచి పేరు తేవాలని నాయకులు హితవు పలికారు. ఏపీ వాణిజ్య పన్నుల శాఖ డివిజన్ ఉపాధ్యక్షులు కె చిట్టిబాబు, జాయింట్ సెక్రటరీలు గెద్దాడ జాన్‌బాబు, కిషోర్ బాబు, ప్రసాద్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

విషం తాగి.. నిన్న భార్య, ఈ రోజు భర్త మృతి


పూర్ణిమ, సుధాకర్(ఫైల్)

భీమడోలు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం నేపథ్యంలో మనస్థాపానికి గురై విషం తాగిన భార్యాభర్తలు రోజు వ్యవధిలో ఇద్దరూ మృతి చెందారు.మంగళవారం భానుపూర్ణిమ మృతి చెందగా బుధవారం తెల్లవారు జామున చికిత్స పొందుతూ భర్త గుండుమోలు సుధాకర్ మృతి చెందాడు. భీమడోలుకు చెందిన గుండుమోలు సుధాకర్, భాను పూర్ణిమ ప్రేమించి పెళ్లి చేసుకోగా వారికి మూడేళ్ల బాబు ఉన్నాడు. అయితే భాను పూర్ణిమ మరొకరి ప్రేమించి వివాహేతర సంబంధం పెట్టుకోవడంతో కుటుంబంలో కలతలు చెల రేగాయి. ఈ నేపథ్యంలో భార్య, భర్తలు భాను పూర్ణిమ, సుధాకర్‌లు విషం తాగడంతో గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించిన సంగతి తెలిసిందే. నేపథ్యంలో మంగళవారం ఉదయం భాను పూర్ణిమ చికిత్స పొందుతూ మృతి చెందగా భర్త సుధాకర్ బుధవారం తెల్లవారు జామున మృతి చెందాడు. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి స్వగ్రామాలకు తరలించారు. దీంతో వారి కుటుంబాల్లో విషాదం అలుముకుంది. ఇదిలా ఉంటే భార్య భాను పూర్ణిమ వాగ్మూలం అనంతరం వివాహేతర సంబంధం ఏర్పరుచుకున్న నిందితుడు కఠారి మోహన్‌ను ఇప్పటికే రిమాండ్‌కు తరలించారు.

చోరీ కేసులో తల్లీకొడుకుల అరెస్ట్

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): నమ్మించి చేతిలో ఉన్న బ్యాగ్‌ను దొంగిలించిన ఇద్దరు తల్లీకొడుకులను రూరల్ సీఐ బి.బి.రవికుమార్ అరెస్ట్ చేశారు. తాడేపల్లిగూడెం తాళ్ల ముదునూరుపాడుకు చెందిన రావూరి ఉమామహేశ్వరరావు ఈ నెల 28న లారీ కొనుగోలు నిమిత్తం తన ఇంట్లోని 146 గ్రాముల బంగారం ఒక బ్యాగ్‌లో పెట్టుకుని పక్క పోర్షన్‌లో అద్దెకు ఉంటున్న కడప జిల్లా మైదుకూరుకు చెందిన ఆకెళ్ల మణికుమార్ అలియాస్ కుమారస్వామి అతని తల్లి లక్ష్మి కాంతంలను లారీ కొనేందుకు ముహూర్తం చూడాలని కోరారు. అయితే వాస్తుకూడా చూస్తామని నమ్మించి వెంట వెళ్లారు. అయితే ఆరుగొలనులో తన పెద్దమ్మ ఇంటి వద్ద కొంత డబ్బు తీసుకుందామని కారులో వెళ్లారు. కారులో ఉన్న మణి కుమార్, తల్లి లక్ష్మీకాంతం బంగారంతో ఉన్న బ్యాగ్ పట్టుకుని పరారయ్యారు. దీంతో ఉమామహేశ్వరరావు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ ఆదేశాల మేరకు డీఎస్పీ విశ్వనాథ్ సూచనలతో సీఐ రవికుమార్, సిబ్బంది చాకచక్యంగా తాడేపల్లిగూడెంలోని తణుకు వైపు బస్టాండ్ వద్ద నిందితులను పట్టుకుని అరెస్ట్ చేశారు. వేగంగా కేసు దర్యాప్తు చేసి నిందితులను పట్టుకోవడమే కాక బంగారం రికవరీ చేయడంపై సీఐ రవి కుమార్, హెడ్ కానిస్టేబుల్ అనిల్ కుమార్,కానిస్టేబుల్స్ మోహన్, పోలిరాజులను ఎస్పీ అభినందించారు.

వృద్ధులపై దాడి.. కేసు నమోదు

ఏలూరు క్రైం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): వృద్ధులు నివసిస్తున్న ఇంటిపై కొంతమంది దాడి చేసి నిర్బంధించి ఇంటిసామగ్రి బయట పడేసి దౌర్జన్యం చేసిన ఘటనపై ఏలూరు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఏలూరు పత్తేబాద మంచినీళ్ల తోటలో నివాసం ఉంటున్న మూలా నాగిరెడ్డి(65) ఆయన భార్య సీతమ్మలు వారి కుమార్తె మూలా రోహితాకు చెందిన ఇంట్లో నివాసం ఉంటున్నారు. మూలా నాగిరెడ్డికి, ఏలూరు సత్రంపాడుకు చెందిన మూలా పెద్దతిరుపతిరెడ్డి, అతని అల్లుడు వింత రమణారెడ్డి ఏలూరు అశోక్ నగర్‌కు చెందిన అతని తమ్ముడు మూల చిన్నతిరుపతిరెడ్డిలతో కోర్టులో సివిల్ తగాదాలు నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ముగ్గురు కలిసి కొంత మందిని ఏర్పాటు చేసి 27న సుమారు 50 మంది ఆటోలు, కార్లు, మోటారు సైకిళ్లపై వచ్చి మూలా నాగిరెడ్డి ఇంట్లోకి వెళ్లి బయటికి పోవాలంటూ సామగ్రి బయటపడేశారు. ఇంటికి ఉన్న సీసీ కెమెరాలు ధ్వంసం చేశారు. ఈ ఘటనపై టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మూలా పెద్ద తిరుపతిరెడ్డి, అతని అల్లుడు వింత రమణారెడ్డి, సోదరుడు మూలా చిన్నతిరుపతిరెడ్డిలపై కేసు నమోదు చేశారు.

పారామెడికల్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు క్రైం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో 2025 - 26 సంవత్సరానికి గాను మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్లు, ఆప్తామాల్మిక్ అసిస్టెంట్, అనెస్థీషియా టెక్నీషియన్, మెడికల్ స్టెరిలైజేషన్ అండ్ ఓటీ టెక్నీషియన్, రేడియోగ్రాఫిక్ టెక్నీషియన్ డిప్లొమో కోర్సులలో ప్రవేశానికి రెండవ ఫేజ్ కౌన్సెలింగ్‌కు ఉమ్మడిపశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ప్రభుత్వ మెడికల కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సావిత్రి తెలిపారు.అభ్యర్థులు తమ దరఖాస్తులను నవంబరు 7వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు ఆఫీసు పని దినాల్లో ఏలూరు వైద్య కళాశాలలో రూ.100 రుసుం చెల్లించి వారి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.దరఖాస్తులు www.apseh-pc.com వెబ్‌సైట్‌లో ఉంటాయని డాక్టర్ సావిత్రి తెలిపారు. సక్రమంగా పూరించని దరఖాస్తులు తిరస్కరిస్తామని,తమ దరఖాస్తులను స్వయంగా ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో సమర్పించాలని, పోస్ట్ ద్వారా పంపితే తిరస్కరిస్తామన్నారు. పారామెడికల్ కోర్సులకు ఇంటర్మీడియట్ బైపీసీ, ఎంపీసీ చదివిన విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత ఇస్తామని, తదుపరి ప్రాధాన్యత మిగిలిన గ్రూపుల ఉంటుందని డాక్టర్ సావిత్రి తెలిపారు.

తుఫాన్‌లో చిక్కుకున్న మహిళ క్షేమంగా ఇంటికి


మహిళను సోదరికి అప్పగిస్తున్న కానిస్టేబుల్

ఏలూరు క్రైం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా చిక్కుకున్న ఒంటరి మహిళకు ఉమెన్ ట్రాపెట్ హోమ్ ద్వారా సురక్షిత రక్షణను కల్పించి ఆమె ఇంటికి మహిళా కానిస్టేబుల్ చేర్చారు. పెదవేగి మండలం కొప్పాక గ్రామానికి చెందిన నల్లమిల్లి రంగమ్మ(26) రాజమహేంద్రవరంలోని బంధువుల ఇంటికి ఈ నెల 28వ తేదీ రాత్రి వెళ్లి తిరిగి వస్తుండగా తీవ్ర తుఫాను ప్రభావంతో రవాణా సౌకర్యం నిలిచిపోవడం వల్ల ఆమె ఏలూరు పాతబస్టాండ్ వద్దకు రాత్రి 11 సమయంలో చేరుకుని దిక్కుతోచని స్థితిలో అయోమయంగా ఉంది. తమ గ్రామానికి వెళ్లడానికి ఎలాంటి అవకాశం లేకపోవడంతో ఒంటరిగా ఉన్న ఆమె పోలీస్ సహాయాన్ని పొందే నిమిత్తం డయల్ 112కు కాల్ చేసింది. ఈసమాచారం అందుకున్న పోలీస్ కంట్రోల్ రూమ్ సిబ్బంది వెంటనే ఉమెన్ ట్రాపెట్ హోం టీమ్‌కు తెలియజేశారు. దీంతో మహిళా కానిస్టేబుల్ శిరీష, హోంగార్డులు కలిసి తక్షణం పాత బస్టాండ్‌కు చేరుకున్నారు. ఒంటరిగా ఉన్న రంగమ్మను పోలీస్ జీపులో ఎక్కించుకుని ఆమె స్వగ్రామమైన కొప్పాక గ్రామానికి తీసుకువెళ్లి సోదరికి అప్పగించారు.

దారికాచి సొమ్ము కాజేసిన దొంగలు

కేసు నమోదు చేసిన పోలీసులు

ఏలూరు క్రైం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణంలో పనిచేసే గుమస్తా రాత్రివేళ షాపు ముగిసిన తరువాత నగదును తీసుకుని వస్తుండగా మార్గమధ్యలో ఐదుగురు యువకులు దారికాసి దోపిడీ చేశారు. ఏలూరు రూరల్ మండలం పోణంగికి చెందిన గుడివాక ఆంజనేయప్రసాద్(52) కామవరపుకోట మండలం కళ్ల చెరువు గ్రామంలో మనీషా వైన్ షాపులో గుమస్తాగా పని చేస్తున్నాడు. ఈనెల 28వ తేదీ రాత్రి 9 గంటల సమయంలో షాపుకట్టి 90 వేల రూపాయల నగదును పట్టుకుని మోటారు సైకిల్‌పై బయలుదేరి ఏలూరు తూర్పులాకుల వద్ద ఉన్న ఆ షాపునకు సంబంధించిన పుచ్చకాయల నాగేంద్ర ప్రసాద్‌కు ఇవ్వడానికి వెళ్తున్నాడు. మార్గమధ్యలో ఏలూరు - జంగారెడ్డిగూడెం రోడ్డులోని దెందులూరు మండలం గంగన్నగూడెం సమీపంలో ఐదుగురు యువకులు రెండు మోటారు సైకిళ్లపై అకస్మాత్తుగా వచ్చి వారిని అడ్డగించి చేతులతో కొట్టి, తలపై మోదారు. అతని వద్ద ఉన్న నగదును బెదిరించి లాక్కుని ఉడాయించారు. ఐదుగురి యువకుల వయస్సు సుమారు 22నుంచి 25 సంవత్సరాల వయస్సు ఉంటుందని బాధితుడు చెబుతున్నాడు. ఈ సమాచారం షాపు నిర్వాహకులు చెప్పడంతో వారికి సంబంధించిన వారు వచ్చి అతనిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి అర్ధరాత్రి తీసుకువచ్చారు. ఈ సంఘటనపై దెందులూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పెదవేగి సీఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు దోపిడీ దొంగల కోసం గాలింపు చేపట్టారు.

ముందస్తుగా మలేరియా పరీక్షలు

ఏలూరు అర్బన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కురుస్తున్న వర్షాల వల్ల అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఏలూరులోని లంబాడీపేట పట్టణ ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ట్వింకిల్ సూచించారు. బుధవారం యూహెచ్‌సీ పరిధిలోని ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. వర్షాలవల్ల తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందని, కాచి చల్లార్చిన నీటినే తాగాలన్నారు. అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ గోవిందరావు మాట్లాడుతూ ఏమైనా అనారోగ్య సమస్యలు తలెత్తితే వైద్యులను సంప్రదించాలని, ప్రాథమిక ఆరోగ్య పరీక్షలను ఉచితంగా చేస్తారని వివరించారు. ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా 94మందికి మలేరియా పరీక్షలు చేశారు. వైద్య సిబ్బంది నాగమల్లేశ్వరరావు, శ్రీనివాసరావు, గోపాలకృష్ణ, చిటిబాబు, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి బ్యాగ్‌లో గొలుసు చోరీ

ఏలూరు క్రైం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఒక వృద్ధురాలు బంగారు గొలుసు బ్యాగ్‌లో పెట్టుకుని ఆటో ఎక్కింది. గుర్తు తెలియని ఇద్దరు మహిళలు ఆ గొలుసు అపహరించారు. ఏలూరు సమీపంలోని వట్లూరుకు చెందిన కారుమంచి రాజేశ్వరి(62) ఈ నెల 27వ తేదీ సాయంత్రం సత్రంపాడులో ఆటో ఎక్కి పాతబస్టాండ్‌లో దిగింది.అదే సమయంలో ఆమెతో పాటు మరో ఇద్దరు మహిళలు ఆటో ఎక్కారు. పాతబస్టాండ్ వద్ద ఆటోదిగి చూడగా రాజేశ్వరి హ్యాండ్ బ్యాగ్‌లో బంగారు గొలుసు కనిపించలేదు.దీంతో వెంటనే ఏలూరు టూటౌన్ పోలీసులకు సమాచారమిచ్చారు. ఈ సంఘటనపై మంగళవారం టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అపహరణకు గురైన గొలుసు సుమారు 5కాసులు ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ ఇద్దరు మహిళల కోసం పోలీసులు గాలింపు చేపట్టారు.

పేకాడుతున్న ఐదుగురి అరెస్ట్

పెదపాడు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పెదపాడు మండలం అప్పనవీడు పంచాయతీ తాళ్లమూడి గ్రామంలో పేకాడుతున్నారనే సమాచారంతో పోలీసులు దాడి చేసి ఐదుగురిని అరెస్ట్ చేసినట్టు పెదపాడు ఎస్.ఐ. కట్టా శారదా సతీశ్ తెలిపారు. వారి నుంచి రూ. 7,400 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కూలిన చెట్టు - విరిగిన విద్యుత్ స్తంభాలు

● గంటల వ్యవధిలో పునరుద్ధరణ

ఏలూరు క్రైం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : చెట్టు కూలి విద్యుత్ వైర్లపై పడడంతో రెండు స్తంభాలు విరిగిపోయి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది హుటాహుటిన చేరుకుని యుద్ధ ప్రాతిపదికన కొత్త స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ఏలూరు త్రి టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న బీఎస్ఎన్ఎల్ ఆఫీస్ ఎదురుగా ఒక చెట్టు బుధవారం ఉదయం విరిగి విద్యుత్ వైర్లపై పడటంతో రెండు స్తంభాలు విరిగిపోయాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ అధికారులు అక్కడకు చేరుకుని వెంటనే రెండు కొత్త స్తంభాలను ఏర్పాటు చేసి వైర్లను బిగించి విద్యుత్ పునరుద్ధరించారు.


విద్యుత్ స్తంభం ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

లోక శాంతి కోసమే యజ్ఞ యాగాలు

కాళ్ల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): లోక శాంతి కోసమే యజ్ఞయాగాలని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు అన్నారు. పెద అమిరం గ్రామంలో ఐదు రోజులపాటు జరిగే 108 కుండముల జ్ఞాన గాయత్రీ మహాయజ్ఞంను బుధవారం డిప్యూటీ స్పీకర్ ప్రారంభించారు. తొలుత గాయత్రీ పరివార్ ఆధ్వర్యంలో భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. యజ్ఞ భీమవరం శాఖ కన్వీనర్ వేగేశ్న రమేష్ వర్మ, కమిటీ సభ్యులు చెరుకువాడ రంగసాయి, శివ రాం పాటిదార్, బలరాం యాదవ్, విక్రమ్ శాంత్, శివాజీ, బంగార్రాజు పాల్గొన్నారు.

2,680 మందికి ఆహారం

మొగల్తూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి):తుఫాన్ కారణంగా ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలు బుధవారం కొనసాగించారు. మంగళవారం రాత్రి తుఫాన్ తీరం దాటినప్పటికీ ఈదురు గాలులు ప్రభావంతో పేరుపాలెం, కెపిపాలెం, పాతపాడు గ్రామాల్లో 8 పునరావాస కేంద్రాల్లోనూ సుమారు 2,680 మంది తుఫాన్ ప్రభావిత ప్రజలకు ఆహారం అందించినట్టు తహసీల్దార్ కె.రాజ్ కిషోర్ తెలిపారు. పునరావాస కేంద్రాలను జిల్లా కలెక్టర్ సీహెచ్ నాగరాణి, ఆర్డీవో దాసిరాజు, పీఆర్‌డిఈ (ప్రాజెక్ట్) యర్రా మెహర్‌బాబా తదితరులు పరిశీలించారు.

ప్రజల భద్రతకు భరోసా

తణుకు, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): తుపాన్ నేపథ్యంలో ప్రజల భద్రతకు భరోసా కల్పిస్తూ నిరంతరం అందుబాటులో ఉండి ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం లేకుండా చర్యలు తీసుకున్న అధికారులను ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అభినందించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తుఫాన్ హెచ్చరికలు వచ్చిన నాటి నుంచి తీరం దాటే వరకు అప్రమత్తంగా ఉంటూ సమర్థవంతంగా ఎదుర్కొన్నారని వివరించారు.

ఆచంటలో అత్యవసర వైద్య సేవలు

ఆచంట, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి):తుఫాన్ నేపథ్యంలో ఆచంట సామాజిక ఆరోగ్యకేంద్రంలో వైద్యులు, సిబ్బంది 24 అందుబాటులో ఉండి సేవలందించినట్టు సామాజిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ వై. అనూష తెలిపారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ మంగళవారం రాత్రి తుఫాన్ సమయంలో కరెంటు లేకపోయినప్పటికి జనరేటర్ ఏర్పాటు చేసుకొని ఆరుగురికి అత్యవసర వైద్యసేవలందించామన్నారు. డాక్టర్ జితేంద్ర మూడు పాము కాటు కేసులకు సకాలంలో పాము కాటు విరుగుడు ఇంజక్షన్‌లు అందించి ప్రాణాపాయ స్థితి నుంచి రక్షించినట్టు తెలిపారు. గుండె నొప్పితో ఒకరు, శ్వాసకోశవ్యాధితో మరొకరికి చికిత్స చేశామన్నారు. కొడమంచిలికి చెందిన గర్భిణీని కూడా ఆసుపత్రి వద్ద అడ్మిట్ చేసుకుని పర్యవేక్షించామన్నారు.

కంట్రోల్ రూమ్ పరిశీలన

భీమవరం టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని తుఫాన్ కంట్రోల్ రూమును జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా కంట్రోల్ రూమ్‌కి వచ్చిన కాల్స్ వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను సంబంధిత శాఖ అధికారులు దృష్టికి తీసుకువెళ్లి తక్షణ పరిష్కార చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ వెంట గ్రామ, వార్డు సచివాలయ అధికారి వై.దోసిరెడ్డి తదితరులు ఉన్నారు.

వరిచేలు పరిశీలన



శివదేవుని చిక్కాలలో వరిచేలు పరిశీలించి రైతులకు సూచనలు ఇస్తున్న మార్టేరు శాస్త్రవేత్తలు

పాలకొల్లు రూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): శివదేవుని చిక్కాలలో తుఫాన్ తాకిడికి నేలకొరిగిన వరిచేలను బుధవారం మార్టేరు వరి పరిశోధన శాస్త్రవేత్తలు డాక్టర్ కృష్ణాజీ, డాక్టర్ సహదేవరెడ్డి, డాక్టర్ రోజా తదితరులు పరిశీలించి రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏవో రాజశేఖర్, రైతులు పాల్గొన్నారు.

కాళ్ల: తుఫాన్ ప్రభావంతో కాళ్ల మండలంలో దెబ్బతిన్న వరిచేలను బుధవారం సాయంత్రం వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించారు. కాళ్ళ, దొడ్డనపూడి, ఏలూరుపాడు గ్రామాల్లో ఆకివీడు ఏడీఏ కె.జీవన్ ప్రతాప్, ఏవో పి.రమేష్ నాయుడు తమ సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నీట మునిగిన వరి కంకులను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు.

నరసాపురం రూరల్: మండలంలో 2వేల ఎకరాలు వరకు నీట మునిగినట్లు వ్యవసాయశాఖ అధికారి జోష్యలా తెలిపారు. బుధవారం వరి, ఉద్యాన, మత్స్యశాఖ, సర్వే విభాగం శాస్త్రవేత్తలు ముంపునకు గురైన పంట పొలాలను పరిశీలించారు. రైతులకు పలు సూచనలు అందించారు. ముంపు చేలులో నిల్వకుండా నీటిని బయటకు తోడుకోవాలన్నారు. 5శాతం ఉప్పు ద్రవం కలిపి లీటర్ నీటిలో కలిపి చల్లాలన్నారు.

ఆచంట: తుఫాన్ కారణంగా నియోజకవర్గంలో పడిపోయిన పంట పొలాలను బుధవారం మాజీ మంత్రి చెరుకువాడ రంగనాథరాజు పరిశీలించారు. పంటలు దెబ్బతిన్న రైతులకు ప్రభుత్వం తక్షణ సాయం అందించాలని డిమాండ్ చేశారు. మండల వ్యవసాయాధికారి బి. నాగరాజు వరి పొలాలు పరిశీలించారు. మండలంలో సుమారు 80 ఎకరాల్లో వరి పంట ముంపునకు గురి కాగా 500 ఎకరాల్లో వరి పంట పడిపోయినట్లు ఏవో ప్రాథమికంగా గుర్తించినట్లు తెలిపారు. ముంపుకు గురైన వరి చేలల్లోనీరు బయటకు పోయే విధంగా మురుగు కాలువలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.

బాధితులకు అండగా కూటమి నేతలు



వృద్ధురాలితో మాట్లాడుతున్న ఉమా

ఆకివీడు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): 12వ వార్డులో మట్టి ఇంటిలో ఒంటరిగా ఉంటున్న దొడ్డిపట్ల పెద్దింట్లమ్మ ఇంటి గోడలు పడిపోవడంతో బాధతో నిరీక్షిస్తుంది. ఈ విషయం టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి గంధం ఉమా దృష్టికి రావడంతో ఆయన వెళ్ళి విషయం తెలుసుకొన్నారు. పెద్దింట్లమ్మను పునరావాసానికి తరలించారు. అదే ప్రాంతంలో విద్యుత్ స్తంభం పడిపోతే దగ్గరుండి పనులు చేయించారు.

'అసత్య ప్రచారాలు నమ్మవొద్దు'

పాలకొల్లు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): క్షీరా రామలింగేశ్వరస్వామి ఆలయం గురించి సోషల్ మీడియాలో కొంతమంది అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని, వాటిని ప్రజలు నమ్మవద్దని ఆలయ కార్యనిర్వహణాధికారి ముచ్చర్ల శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. స్వామివారి ఆలయంలో విశిష్ట దర్శనం వంద రూపాయల రుసుముతో ఏర్పాటు చేశామని, ఈ ఉత్తర్వులు 2021లోనే కమిషనర్ ఇచ్చారని తెలిపారు. అలాగే కార్తీకమాసం నెలరోజులు అభిషేకం చేయించుకునే భక్తుల నుంచి రూ.750 వసూలు చేస్తున్నామని, ఒక సంవత్సరం అభిషేకం చేయించుకునే భక్తుల నుంచి రూ.1000 వసూలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఒక సంవత్సరం అభిషేక రుసుము రూ.1000 ఇప్పుడు కొత్తగా పెట్టినది కాదని, గత పది సంవత్సరాలుగా అమలు అవుతుందని తెలిపారు. కొంతమంది వ్యక్తులు సోషల్ మీడియాలో ఈ రుసుములు ఈ సంవత్సరమే ప్రవేశపెట్టినట్లుగా వార్తలు రాస్తున్నారని వీటిని ప్రజలు, భక్తులు నమ్మవద్దని కోరారు.

తుఫాన్ బాధితులకు చీరలు, నగదు పంపిణీ

గణపవరం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి):కాశీపాడులో నిరుపేదలకు చీరలు, నగదు, పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన దాత నడింపల్లి సుధాకరరాజు, ఎంపీడీవో బేబి శ్రీలక్ష్మి చేతుల మీదుగా 60మంది నిరుపేదలకు చీరలు, 15 మందికి వెయ్యి రూపాయలు చొప్పున నగదును పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తెర్లి నాగరాజు, ఎంపీటీసీ జంపన రమేశ్‌రాజు, గ్రామసెక్రటరీ జాషువ పాల్గొన్నారు.

పేదలకు కూరగాయలు పంపిణీ

మొగల్తూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి):మొంథా తుఫాన్ ప్రభావం అంతకు ముందు వరుస వర్షాలతో కూలీ పనులు లేక ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలకు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు నీటి సంఘ మాజీ ఉపాధ్యక్షుడు పంపన శ్రీకృష్ణ భగవాన్ బాసటగా నిలిచారు. గ్రామంలోని ఆదర్శనగర్ కాలనీ, పోతులవారిమెరక, పుచ్చకాయలపేట, కుక్కలవారితోట గ్రామాల్లో సుమారు 300 కుటుంబాలకు నాలుగు రోజులు సరిపడా రూ.30వేలు విలువ గల కూరగాయలు బుధవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు గుబ్బల నాగరాజు, పట్టణ అధ్యక్షుడు బొల్లా చంటి, పీతాని శేఖర్ పాల్గొన్నారు.

కష్టం..నష్టం

- నేలవాలిన వరి చేలు.. విరిగిపడ్డ చెట్లు
- నష్టపోయామంటూ రైతుల లబోదిబో
- గ్రామాల్లో మంగళవారం రాత్రి అంధకారం

నిండా ముంచిన మొంథా తుఫాన్.. నష్టం అంచనాల్లో అధికారులు.. పునరావాస కేంద్రాల్లో బాధితులు



దువ్వలో నేలకొరిగిన వరి పైరు



విద్యుత్ వైర్లకు మరమ్మతులు చేస్తున్న విద్యుత్ శాఖాధికారులు



రామన్నపాలెం రహదారిపై కూలిన చెట్లును దగ్గరుండి తొలగింపజేస్తున్న ఎస్ఐ వాసు, సిబ్బంది



చించినాడలో పడిపోయిన చెట్టు

పెనుగొండ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి):తుఫాన్ కారణంగా మంగళవారం రాత్రి వీచిన ఈదురు గాలులు, వర్షంతో మండలంలోని పలు గ్రామాల్లో వరి చేలు నేలవాలాయి. కొఠాలపర్రులో పంట కాలువలోకి తాటి చెట్టు విరిగిపోయింది. పలు గ్రామాల్లో అరటి చెట్లు విరిగిపడ్డాయి. మునమర్రు, కొఠాలపర్రు గ్రామాల్లో వరి పొలాలు నేలవాలాయి. రహదారులు బురదమయంగా మారాయి. మంగళవారం సాయంత్రం నుంచి బుధవారం ఉదయం వరకు విద్యుత్ లేకపోవడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ఆచంట: ఈదురు గాలులకు మండలంలో పలు చోట్ల పంట పొలాలు నేలకొరిగాయి. అయోధ్యలంక, పెదమల్లం లంక వంటి గ్రామాల్లో అరటి తోటలు సైతం ఈదురుగాలులకు పడిపోయాయి. ముఖ్యంగా రెండు రోజులుగా అన్నిగ్రామాల్లో విద్యుత్‌సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. బుధవారం మధ్యాహ్నం నుంచి ఆచంటలో విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

తణుకు:తుఫాన్ ప్రభావంతో ఈదురు గాలులకు చాలా ప్రాంతాల్లో చెట్లు నేలవాలాయి. విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. నియోజకవర్గంలో 16 ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు విరిగినట్లు విద్యుత్ శాఖ ఏడీఈ దివాకర్ చెప్పారు. ఇప్పటి వరకు సుమారుగా అన్ని ప్రాంతాల్లో స్తంభాల పునరుద్ధరణ పనులు పూర్తి చేశామని, ఒకటి, రెండు చోట్లు మాత్రం ఇంకా పనులు జరుగుతున్నాయని వివరించారు. అజ్జరం కాలనీలో మాత్రం పనులు జరుగుతున్నాయి.

తణుకు రూరల్:తణుకు మండలంలో 1743 ఎకరాల్లోని వరి పంట నేల వాలినట్లు వ్యవసాయాధికారి కె. రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. తణుకు మం డలంలో మొత్తం 11,847 ఎకరాలలో వరి సాగు పంట సాగు చేస్తున్నట్లు తెలిపారు. తుఫాన్ కారణంగా దెబ్బతిన్న పొలాలను ఏఎంసీ చైర్మన్ కొండేటి శివ, వైస్ చైర్మన్ వల్లూరి రామ్మోహన్ పరిశీలించారు.

యలమంచిలి:యలమంచిలి, కాంభో ట్లపాలెం, కాజ, కొంతేరు, తదితర గ్రామాల్లో వరిచేలు నేలకొరిగాయి. అధికంగా వర్షాలు కురవడంతో పడిపోయిన వరిదుబ్బులు నీటిలో నానుతున్నాయి. యలమంచిలి మం డలంలో సుమారు 500 ఎకరాల వరి పంట కు నష్టం వాటిల్లింది. ప్రస్తుతం ఈనిక దశ లో ఉన్న వరిచేలు పడిపోయి, నీట మునగ డంతో అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. లక్ష్మీపాలెం, కనకాయలంక, అబ్బి రాజుపాలెం తదితర గ్రామాల్లో సుమారు 200 ఎకరాల్లో అరటి సాగవుతోంది. సుమా రు 40 ఎకరాల్లో అరటితోటలు పడిపోయా యి. ఎకరాకు సుమారు రూ.50వేలకు పైగా పెట్టుబడి పెట్టామని రైతులు తెలిపారు.

ఆకివీడు: ఈదురు గాలులు వీయడంతో మంగళవారం సాయంత్రం నుంచి విద్యుత్ సరఫరా నిలుపుదల చేసి బుధవారం ఉదయం ఏడు గంటలకు ఇచ్చారు. చినప ల్లివీధిలోని పల్లపు ప్రాంతం, ఏఎంసీ రహదారులలో నిలిచిన నీటిని ఏఎంసీ చైర్మన్ బొల్లా వెంకట్రావు పరిశీలించి నివారణ చర్యలకు అధికారులకు సూచించారు. ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టడంతో ఎటువంటి విపత్తు జరగకుండా నివారించకల్గామని భీమవరం డివిజన్ ఎలక్ట్రికల్ నోడల్ అధికారి చాముండేశ్వరీ, ఈఈ వెంకటేశ్వరరావు అన్నారు. తుఫాన్ ప్రభావం కారణంగా ముందస్తు చర్యగా విద్యుత్ నిలుపదల చేశామని తెలిపారు. డివిజన్ పరిధిలో తలెత్తిన సమస్యలు తమ సిబ్బందితో పరిష్కరిస్తున్నామన్నారు.

ఇరగవరం:తుఫాన్ ప్రభావంతో గ్రామాల్లోని భారీ వృక్షాలు నెలకొరిగాయి. గోటేరు, కత్తవపాడు, రేలంగి, ఏలేటిపాడు తదితర గ్రామాల్లో కొబ్బరి చెట్లు రోడ్లుకు అడ్డంగా పడిపోయాయి. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. పడిపోయిన చెట్లు కరెంటు తీగలపై పడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. సిబ్బంది పునరుద్ధరణ పనులు చేపట్టారు. మండలంలోని గమళ్ళపాడు, చిన్నరామని చెర్వు, కొత్తపాడు, స్తంభాలు విరిగిపోయాయి. గ్రామాలలోని పునరావాసులకు అధికారులు, కూటమి నాయకులు ఆహారం,బియ్యం, కూరగాయలు పంపిణీ చేశారు.

పెంటపాడు: మండలంలో అన్ని గ్రామాల్లోనూ వరిచేలు నేలకు ఒరిగాయి. పరిమెళ్ళలో నష్టం తీవ్రత ఎక్కువగా ఉంది. మండలంలో 2900 ఎకరాలలో పంటనష్టం వాటిల్లినట్లు అధికారులు చెబుతున్నారు. ముదునూరు, ఆకుతీగపాడు, పరిమెళ్ళ, మౌంజీపాడు గ్రామాలలో వరిపొలాలను ఏడీఏ గంగాధర్‌రావు, ఏవో చీర్ల రవికుమార్, తహసీల్దార్ రాజరాజేశ్వరి, డీటీ సీతారత్నం పరిశీలించారు.

కాళ్ల: తుఫాన్ వల్ల మంగళవారం చాలా గ్రామాల్లో ప్రజలు రాత్రంతా విద్యుత్ లేక చీకట్లో గడపాల్సి వచ్చింది. శివారు గ్రామాలు ఇంకా ముంపు నీటిలోనే నానుతున్నాయి. ఏలూరుపాడు, కాళ్ళ, కలవపూడి, ఆనందపురం, బోస్ కాలనీ, మోడి, గోగుతిప్ప, గాంధీ నగర్, ఇసుకలంక, సత్యనారాయణపురం తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఏలూరుపాడు గ్రామంలో విద్యుత్ స్తంభాలను తీసి కొత్త స్తంభాలను ఏర్పాటు చేశారు. నీట మునిగి, నేలకొరిగిన వరి పంటను వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించారు.

నరసాపురం రూరల్: సీతారాపురం సౌత్ గ్రామంలో ఈదురు గాలులకు భారీ వృక్షాలు నేలకొరిగాయి. కాలువ పక్కన సుమారు 30 కుటుంబాలు పూరి గుడిసెల్లో నివాసం ఉంటున్నారు. బుధవారం ఈదురు గాలులు, వర్షాలకు భారీ వృక్షాలు గుడిసెలపై పడ్డాయి. అయితే ఆసమయంలో ఇళ్లల్లో ప్రజలు లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. ఇంట్లోని టీవీలు, ఫ్రిజ్‌లు, ఇతర సామగ్రి ధ్వంసమయ్యాయి. సుమారు రూ 3లక్షల వరకు నష్టం జరిగి ఉంటుందని అంచన వేశారు. విప్ నాయకర్, పొత్తూరి రామరాజు, కొల్లు పెద్దిరాజు, మాజీ సర్పంచ్ ఆడబాల అయ్యప్పనాయుడు, కొప్పాడ రవి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

పెనుమంట్ర: మండలంలో 11 గ్రామాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి 276 మందికి షెల్టర్ కల్పించారు. ఒక ఇల్లు పూర్తిగానే మరొక ఇల్లు పాక్షికంగా దెబ్బతిన్నట్లు తహసీల్దార్ ఏలియమ్మ తెలిపారు. గాలులకు చెట్లు నేలకొరగడంతో 22 విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయి వీటిని యుద్ధ ప్రాతిపదికన 52 మంది సిబ్బంది 15 కిలోమీటర్ల విద్యుత్ లైన్లో పునరుద్ధరించారు. ఓడూరు లో ఇండస్ట్రియల్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారని ఎలక్ట్రికల్ ఏఈ గూడూరి నాగరాజు తెలిపారు. 18 గ్రామాలకు విద్యుత్‌ను బుధవారం సాయంత్రానికి పునరుద్ధరించినట్లు చెప్పారు. తుఫాను కారణంగా 720 ఎకరాలు వరి పంట నష్టం జరిగినట్టు అంచనా వేశారు.

తాడేపల్లిగూడెం రూరల్: నవాబుపాలెం, కృష్ణాయపాలెం, జగన్నాథపురం, మారంపల్లి, ఆరుళ్ల, నందమూరు. దండగర్ర తదితర గ్రామాల్లో వరిపంటకు నష్టం వాటిల్లింది. మండలంలో నవాబుపాలెం, ఆరుళ్ల, నందమూరు మారంపల్లి గ్రామాల్లో వ్యవసాయాధికారులు పర్యటించారు. మండలంలో 2వేల ఎకరాల్లో వరిపంట నష్టం ఉంటుందని ప్రాథమికంగా అంచనా వేసినట్టు ఏవో నారాయణరావు తెలిపారు.

గణపవరం: మండలంలో 1904 ఎకరాల్లో పంట నేలమట్టం అయ్యిందని, 46ఎకరాల్లో ముంపునకు గురైందని ప్రాథమిక అంచనాలో తేలిందని ఏవో ఆర్‌ఎస్. ప్రసాద్ తెలిపారు. ఎక్కువగా పాలుపోసుకునే దశలో వరి చేలున్నాయని ఈ దశలో నీరు బయటకు పోయేలా రైతులు చూసుకోవాలన్నారు.

మొగల్తూరు:మొగల్తూరు పంచాయతీ పరిధిలో సుమారు 9 ఇళ్లు ఈదురు గాలులకు దెబ్బతిన్నాయి. మరికొన్ని గ్రామాల్లో ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నట్టు అధికారులు తెలిపారు. మొగల్తూ రు-వెంప రహదారిలో కొత్తపాలెం గ్రామ మాజీ సర్పంచ్ షైలా బత్తుల మరియమ్మ రాంబాబు 20 మంది కూలీలతో గోతుల్లో నిలిచిన వర్షం నీటిని మళ్ళించి గోతులను సొంత ఖర్చుతో గ్రావెల్‌తో పూడ్చించారు. రామన్నపాలెం పంచాయతీ పరిధిలో రహదారిపై కూలిన భారీ వృక్షాన్ని బుధవారం రాత్రి ఎస్ఐ జి.వాసు, పోలీస్ సిబ్బంది తొలగించారు. మంగళవారం ఉదయం నుంచి బుధవారం రాత్రి వరకూ విద్యుత్ సరఫరా లేకపోవడంతో తీర గ్రామాలు అంధకారంగా మారాయి.

యలమంచిలి: మండలంలో సుమారు 82 చెట్లు, 90 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. పునరుద్ధరణ పనులు చేపడుతున్నారు. సుమారు 100 మంది ఈ పనుల్లో నిమగ్నమయ్యారు. మేడపాడు గ్రామంలో చెట్టుకూలి ఇంటిమీద పడటంతో ఒక ఇల్లు పాక్షికంగా దెబ్బతింది. మండలంలోని 11గ్రామాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో 136 మందికి ఆశ్రయం కల్పించారు. సుమారు 500 ఎకరాల్లో వరిచేలు నీటమునిగాయి. సుమారు 45 ఎకరాల్లో అరటితోటలు పడిపోయాయి.

ఉండి:డ్రెయిన్లు..కాలువలలో పేరుకున్న గుర్రపుడెక్క, తూడులను తక్షణమే తొలగించి రైతులను ఆదుకుంటాందామని ప్రాజెక్టు కమిటి చైర్మన్ కునాధరాజు మురళీకృష్ణంరాజు అధికారులకు సూచించారు. ఉధృతంగా ప్రవహిస్తున్న బొండాడ డ్రెయిన్ తదితర వాటిని పరిశీలించి అధికారులకు తగు సూచనలు ఇచ్చామన్నారు. అధికారులు తక్షణమే పనులపై దృష్టిపెట్టి రైతుల పొలాలకు నష్టం కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

తుఫాన్‌తో ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా 24 కుటుంబాలకు చెందిన యానాదుల వారిని సురక్షిత ప్రాంతానికి తరలించినట్లు తహసీల్దారు నాగార్జున తెలిపారు. బుధవారం మండలంలోని చెరుకువాడలోని పునరావస ప్రాంతమైన మండలపరిషత్ పాఠశాలకు వెళ్లి వారితో మాట్లాడారు. వారికి అవసరమైన ఏర్పాట్లును చేసినట్లు తెలిపారు. భోజన సమయంలో వారికి దగ్గరవుండి అందిస్తున్నట్లు తెలిపారు. ఉండిలోని సివిల్‌సప్లయిస్ గొడౌన్ స్టోర్‌పై చెట్టు కూలిపోయింది. దాంతో పైన రేకులు దెబ్బతిన్నాయి. దానికికొంచెం దూరంలో కూడా మరో భారీచెట్టు వాహనాలు వెళ్లే రహదారిలో కూలిపోవడంతో వాహనాలు వెళ్లడానికి కొంత అంతరాయం ఏర్పడింది. మండలంలోని ఆయా చోట్ల రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయి.

భీమవరం రూరల్:చినఅమిరంలో తుఫాన్ కారణంగా నీట మునిగిన వరి పొలాలను బుధవారం జిల్లా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నీట మునిగిన వరి పొలాలు వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మండలంలో 3,340 ఎకరాల విస్తీర్ణంలో వరి పంట నీట మునిగిందన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి ఐదు రోజుల్లో పంట నష్టాల వివరాలు సేకరించి సంబంధించిన యాప్‌లో నమోదు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

పాలకొల్లు టౌన్: తుఫాన్ ప్రభావం వల్ల ఎటువంటి ఆస్తి, ప్రాణ నష్టం కలగకుండా ఉండేలా అధికారులు, ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకున్నారు. ఇదిలా ఉంటే పాలకొల్లు పట్టణంలో విద్యుత్తుశాఖ అధికారులు సిబ్బందిని అప్రమత్తంగా ఉంచడంలో సఫలీకృతమయ్యారు. ఈదురుగాలులకు పలుచోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరిగిన దృష్ట్యా వెంటనే మరమ్మతు చర్యలు చేపట్టారు. మంగళవారం రాత్రి అంతటా విద్యుత్ సరఫరా లేకపోయినా ఉదయం 8గంటల తరువాత పట్టణంలో విద్యుత్ సరఫరా చేశారు. సెల్ టవర్లకు విద్యుత్ సరఫరా సరిగాలేకపోవడంతో టవర్లు మొరాయించడంతో బుధవారం మధ్యాహ్నం వరకూ నెట్ సమస్య, ఫోన్‌కాల్స్ సమస్యతో ప్రజలు ఇబ్బంది పడ్డారు.



నక్కావారిపాలెంలో కూలిన చెట్లు తొలగిస్తున్న దృశ్యం



పరిమెళ్ళలో నేలకు వరిగిన వరిచేలు







తణుకు పునరావాస కేంద్రంలో భోజనాలు వడ్డిస్తున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి..తాడేపల్లిగూడెంలో భోజనాలు వడ్డిస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి.. గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు

ముందస్తు చర్యలతో ప్రాణ నష్టం నివారించాం

పాలకోడేరు:ముందస్తు చర్యలు తీసుకోవడం వల్ల ప్రాణ నష్టాలు లేకుండా చేయగలిగామని డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు అన్నారు. పాలకోడేరులోని సహకార బ్యాంకు వద్ద మండల స్థాయి అధికారులతో బుధవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొంథా తుఫాన్ ప్రతి ఒక్కరినీ ఎంతో ఆందోళన కలిగించిందన్నారు. ముందస్తుగా తుపాన్ షెల్టర్లను ఏర్పాటు చేసి ప్రజలను సురక్షితంగా ఉంచి వారి యోగక్షేమాలను చూడటం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్, డెల్టా ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కునాథరాజు మురళీకృష్ణంరాజు, పాలకోడేరు సొసైటీ బ్యాంక్ అధ్యక్షుడు కొత్తపల్లి నాగరాజు, మండల టీడీపీ అధ్యక్షుడు కొత్తపల్లి సూర్యనారాయణరాజు, తహసీల్దార్ భారతీ విజయలక్ష్మి, ఎంపీడీవో రెడ్డియ్య పాల్గొన్నారు

తణుకు: బాలురున్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ సందర్శించారు. అక్కడ వరద బాధితులకు స్వయంగా భోజనాలు వడ్డించారు. అక్కడ వైద్యం తదితర సౌకర్యాలు గురించి అడిగి తెలుసుకున్నారు. సాయంత్రం బాధితులు వారి నివాసాలకు వెళ్ళారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ టి. రామ్‌కుమార్. తహసీల్దార్ డీవీఎస్ఎస్ అశోక్ వర్మ, కూటమి నాయకులు కలగర వెంకట కృష్ణ, తాతపూడి మారుతీరావు పాల్గొన్నారు.



నిర్వాసితులకు అన్నదానం చేస్తున్న వలవల బాబ్జి

వీరవాసరం,(భీమవరం టౌన్):వీరవాసరంలోని ఎంఆర్‌కే జడ్పీ హైస్కూల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని బుధవారం ఎమ్మెల్యే అంజిబాబు సందర్శించారు. సుమారు 100 మందికిపైగా ఉన్న బాధితులతో మాట్లాడి భరోసా కల్పించారు. అనంతరం ప్రభుత్వాసుపత్రిలోని గర్భిణులకు దాతల సహకారంతో ఏర్పాటు చేసిన పౌష్టికాహారాన్ని ఎమ్మెల్యే అంజిబాబు అందించారు. కార్యక్రమంలో కోళ్ళనాగేశ్వరరావు, గంటా త్రిమూర్తులు, బండి రమేష్ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం:తాడేపల్లిగూడెం నియోజకవర్గ యంత్రాంగం అహర్నిశలు కృషి చేస్తూ ప్రజలకు సురక్షిత ప్రాంతాలకు తరలించి పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ కితాబిచ్చారు. పట్టణంలోని 6వ వార్డుకు చెందిన 20 కుంటాబాలకు చెందిన యానాదులను తాడేపల్లిగూడెంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో వసతి, భోజన ఏర్పాట్లను ఆయన బుధవారం పరిశీలించారు.

తాడేపల్లిగూడెం రూరల్: చినతాడేపల్లిలో నేలవాలిన వరి పొలాలను భవన నిర్మాణ, కార్మిక సంక్షేమ చైర్మన్ వలవల బాబ్జి పరిశీలించారు. అనంతరం పునరావాస కేంద్రాలకు తరలించిన వారికి భోజనాలు వడ్డించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పరిమి రవికుమార్, మాజీ సర్పంచ్ చిటకన శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆకివీడు: తుఫాన్ ప్రభావంతో పల్లపు ప్రాం తవాసులకు జిల్లా పరిషత్ బాలురు ఉన్నత పాఠశాలలో పునరావాసం కల్పించారు. బుధవారం పునరావాసులకు టిఫిన్, భోజనాలు కూటమి నేతలు, అధికారులు అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బొల్లా వెంకట్రావు, మహిళా మండలాధ్యక్షురాలు బచ్చు సరళాకుమారి, కౌన్సిలర్ బత్తుల శ్యామల తదితరులు ఉన్నారు.

క్షీరారామ లింగేశ్వర స్వామిపై తుఫాన్ ఎఫెక్టు

పాలకొల్లు టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో కార్తీక మాసంలో పంచారామాల్లో ఒకటైన క్షీరారామ లింగేశ్వరస్వామిని దర్శించుకునేందుకు భక్తులు ఆసక్తి చూపలేదు. కార్తీకమాసం ఎనిమిదవ రోజు బుధవారం 800 మంది భక్తులు మాత్రమే స్వామివారిని దర్శించుకున్నారు. గత కార్తీక సోమవారం నాడు సుమారుగా 25వేల నుంచి 30వేల మంది వరకూ భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు చెబుతున్నారు. కార్తీకమాసం మామూలు రోజుల్లో సుమారు 10 నుంచి 12వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకునేవారని, తుఫాను ప్రభావంతో భక్తుల రద్దీ లేదని ఆలయ అధికారులు చెబుతున్నారు.